# కర్నూలు | నంద్యాల
# వార్త

11 నవంబర్ 2022 శుక్రవారం పేజీలు 4


## సీఎం సార్ రైతుల కన్నీటీ కష్టాలు కనిపించడం లేదా : మాజీ ఎమ్మెల్యే బీవీ

- గోనెగండ్ల లో టమోటా రైతులను పరామర్శించిన బీవీ
- ధరల స్థిరీకరన కోసం రూ.3వేల కోట్ల ఎక్కడ
- కనిపించని రైతు భరోసా

**గోనెగండ్ల నవంబరు 10 ప్రభాతవార్త**

రైతు రాజ్యాం మాది రైతులను కష్టాలు రాకుండా చూస్తామన్నా సీఎం జగన్ గారు ఇప్పుడు రైతుల కన్నీటి కష్టాలు కనిపించడం లేదా పండించిన పంటలకు గిట్టుబాటు ధరలేక ఆత్మహత్యలే శర్యణ్యం అంటురైతుల రోదిస్తు న్నారని సీఎం నా ప్రశ్నకు సమాదానం చెప్పాలని మాజీ ఎమ్మెల్యే టీడీపీ రాష్ట్ర ఉపాద్యక్షుడు బీవీ జయనాగేశ్వరరెడ్డి కోరారు. గురువారం గోనెగండ్లలో పంటపోలాల్లో ఆయన పర్యటించారు. టమోటా పంటను సాగు చేసిన రైతులు లక్ష్మినారాయణ, రాముడు కష్టాలను అడిగి తెలుసుకున్నారు. పెట్టుబడి ఎంత, అమ్మితే వచ్చే మొత్తం ఎంత, అని అడిగారు. అందుకు రైతులు నష్టాలలో ఉన్నామని కన్నీటితో సమాధానం చెప్పారు. ఈ సందర్భంగా బీవీ మాట్లాడుతూ జగన్ ప్రభుత్వంలో రైతులకు తీరని అన్యాయం జరుగుతుందన్నారు. రైతులు పండించిన పంటలకు



గిట్టుబాటు ధర కల్పించేందుకు గాను ఎన్నికల సమయంలో రైతులకు ధరల స్థిరికరణ కోసం రూ. 3వేల కోట్లు కేటాయిస్తామని చెప్పిన మాట ఏమైందని ఇప్పుడు ఆ మూడు వేల కోట్లు ఎక్కడా అని బీవీ ప్రశ్నించారు.

• వివరాలు 2లో

## సచివాలయాలతో.. గ్రామాల్లోనే ప్రభుత్వ సేవలు

- ఎంఎల్ఏ వై.బాలనాగిరెడ్డి



**వగరూరు(మంత్రాలయం), నవంబర్ 10, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న సచివాలయాలతోనే గ్రామాల్లో ప్రభుత్వ సేవలను అందిస్తున్నట్లు వైసిపి జిల్లా అధ్యక్షులు, ఎంఎల్ఏ వై. బాలనాగిరెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని వగరూరు గ్రామంలో సుమారు రూ. 40 లక్షలతో నిర్మించిన నూతన సచివాలయ భవనాన్ని వైసిపి సీనియర్ నాయకులు వై. సీతారామిరెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతిగ్రామంలో నూతన సచివాలయాలను నిర్మిస్తున న్నట్లు వెల్లడించారు. కాబట్టి గ్రామ ప్రజలందరూ ఆయా గ్రామాల్లో ఉన్న సచివాలయసేవలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ భీంరెడ్డి, ఇంఛార్జ విశ్వనాథ్‌రెడ్డి, పిఆర్ఏఈ నరసి ంహులు, ఎంపిడిఓ ప్రభావతి, ఏపిఎం జయశ్రీ, ఏపిఓ తిమ్మారెడ్డి, ట్రాన్ ్స కో ఏఈ గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

## ఏసీబీ.. కక్ష..కట్టిందా..!



**కర్నూలు, ప్రభాతవార్త :**

**కర్నూలు జిల్లా ఏసీబీ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేసిన చేసిన ఏడు నెలలకు ఎఫ్ఐఆర్ కట్టి వెంటనే అరెస్టు చేశారు. ఇంకా విచిత్రమేమిటంటే ఏడు నెలలకే కాదు ఎప్పుడు ఫిర్యాదు వస్తే అప్పుడు కేసు నమోదు చేస్తామంటున్నారు. దీంతో ఎన్ని సంవత్సరాల వరకు కేసు కట్టేందుకు వీలుంటుందన్న వ్యంగోక్తులు విన్పిస్తున్నాయి. ఇక అరెస్టుకు ముందు ముద్దాయిని విచారించ లేదు. హఠాత్తుగా అరెస్ట్ చేశారు. ఏసీబి అధికారులు చేపట్టిన సర్ప్రైజ్ చెక్‌లో అరెస్ట్ అయిన ముద్దాయిపై ఎలాంటి అభియోగాలు లేకపోవడం గమనార్హం. ఇందులో ఆసక్తి కలిగించే విశేషమేంటంటే ఏసీబీ అధికారులకు ఫిర్యాదుదారుడుగా ఉన్న వ్యక్తి తాను కంప్లైంట్ ఇవ్వనని చెప్పిన ఏసీబీ అధికారులు బలవంతంగా సంతకం పెట్టించారని వాపోవడం.. ఏది ఏమైనా కల్లూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సబ్ రిజిస్ట్రార్ అరుణ్ కుమార్‌ను సోమవారం ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు. ఈ విషయంలో రిజిస్ట్రేషన్ శాఖకు చెందిన వర్గాలలో తీవ్ర అనుమానాలు నెలకొన్నాయి. ఏసీబీ అధికారులు ఏదో ఉద్దేశంతో కక్ష సాధింపుగా ఈ కేసు పెట్టారని కొందరు అంటుండగా.... మరికొందరు అనిల్ కుమార్‌ను కల్లూరు రిజిస్ట్రార్ ఆఫీస్ నుంచి తప్పించేందుకు జరిగిన హై లెవెల్ కుట్ర అని అంటున్నారు. ఏది ఏమైనా ఈ కేసు కర్నూలు జిల్లా కేంద్రంలో అటు రిజిస్ట్రేషన్ శాఖ సంబంధించిన వారిలోనూ, ఇటు రియల్ ఎస్టేట్ వ్యక్తులలోనూ తీవ్ర చర్చనీయాంశంగా మారింది.**

ఈ సంవత్సర ఏప్రిల్ నెల 27, 28 తేదీలలో రాష్ట్రవ్యాప్తంగా ఏసీబీ ఆకస్మిక దాడులు చేపట్టింది. అందులో చాలా కార్యాలయాలలో డబ్బు దొరికింది. అందులో కర్నూలు, కల్లూరు కార్యాలయాల్లో సైతం నగదు దొరికింది. 20 కి పైగా కార్యాలయాల్లో జరిగిన దాడులలో ఎవరిని అరెస్టు చేయలేదు. కేవలం రిజిస్ట్రేషన్ శాఖ అధికారులకు నివేదిక ఇచ్చారు. నివేదికల మేరకు ఆ శాఖ వారిని డిప్యూటేషన్లలో లేదా ట్రాన్స్ఫర్‌లలో బదిలీ చేసింది. కల్లూరు లో కూడా అదే పని జరిగింది. కల్లూరు సబ్ రిజిస్టర్‌ను బనగానపల్లెకు డిప్యూటేషన్ పై పంపించారు. అయితే ఉన్నతాధికారులకు ఆయన పనితనం నచ్చి తిరిగి కర్నూల్లోని నియమించారు. ఇది ఇలా ఉండగా ఆకస్మిక తనిఖీలు జరిగి ఏడు నెలలు తర్వాత కల్లూరు సబ్ రిజిస్ట్రార్‌పై ఏసీబీ అధికారులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఒక దశలో ఏసీబీ రాష్ట్ర కార్యాలయంకు పంపిన నివేదికల మేరకు ఆదేశాలు వచ్చేయని అధికారులు చెప్పినట్లు చర్చ జరిగింది.

• వివరాలు 2లో

- ఆకస్మిక తనిఖీల కేసులో ఏడు నెలల తర్వాత ఎఫ్ఐఆర్
- ముందస్తు విచారణ లేకుండా హఠాత్తుగా అరెస్ట్
- బలవంతంగా సంతకం పెట్టించారంటున్న ఫిర్యాదుదారుడు
- కల్లూరు సబ్ రిజిస్ట్రార్ కేసులో ఏసీబీపై విమర్శలు



## తూతూ మంత్రం.. ప్లాస్టిక్ నిషేదం..!

- ఎమ్మిగనూరులో జోరుగా ప్లాస్టిక్ విక్రయాలు
- ముంచుకొస్తున్న ముప్పు
- చూసి చూడనట్లు వ్యవహరిస్తున్న మునిసిపల్ అధికారులు

**ప్లాస్టిక్ వినియోగం ఆరోగ్యానికి ప్రమాదకరమని, వాతావరణంపై తీవ్ర ప్రభావం చూపుతుందని తెలిసినా..ప్రజలు వినియోగిస్తూనే ఉన్నారు.ఉదయం లేచిన దగ్గర నుంచి రాత్రి పడుకునే వరకు ప్రతి ఒక్కరి జీవితంలో ప్లాస్టిక్ భాగమైపోయింది. దీతో ప్రజా ఆరోగ్యానికి, పర్యావరణానికి పెను ముప్పుగా మారింది. నిత్యవసర సరుకులు, కూరగాయలు ఇలా ఏది తేవాలన్నా ప్లాస్టిక్ కవర్లు కావాల్సిందే. ప్లాస్టిక్ లేనిదే ఏ సరుకు తెచ్చుకోలేని పరిస్థితి ప్రస్తుతం నెలకోంది. 50 మైక్రాన్స్ కన్నా తక్కువ ఉన్న ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిషేదించారు. దీనిని పక్కగా అమలు చేయాల్సిన అధికార యంత్రాంగం నిర్లక్ష్యం కారణంగా పట్టణ వీధులు, మురుగు కాలువలు ప్లాస్టిక్ కూపాలుగా మారుతున్నాయి. రోగాలు పెంచుతున్నాయి. ప్లాస్టిక్ భూమిలో వేస్తే నేల కలుషితమవుతోంది. కాలిస్తే విషవాయువులు వాతావరణంలో కలిసి పర్యావరణం దెబ్బతింటోంది. జీవ మనుగడపై దుష్ప్రభావం కలిగించే ప్లాస్టిక్ నిషేదంలో పురపాలక అధికారులు పూర్తిగా వైఫల్యం చెందారనే ఆరోపణలు లేకపోలేదు.**

**ఎమ్మిగనూరు నవంబర్ 10 ప్రభాతవార్త:**

**- ఎక్కడపడితే అక్కడ..:**
ప్లాస్టిక్ వ్యర్థాలు ఎక్కడపడితే అక్కడ పారేస్తున్నారు. మురుగు కాల్వల్లో వేయడం వల్ల నాలాలకు అడ్డంపడి మురుగు రోడ్లపైకి చేరుతుంది. కల్వర్టులకు అడ్డంగా చేరి వర్షం వస్తే రోడ్లు చెరువుల్లా మారుతున్నాయి. దుకాణదారులు డ్రైనేజిలపై బండలు వేయడం, వాటి కింద ప్లాస్టిక్ ఇరుక్కుపోయి పారిశుధ్య సమస్యలు తలెత్తుతున్నాయి. 50 మైక్రాన్ల లోపు ప్లాస్టిక్ వినియోగం నిషేదం ఉన్నా..అమలు చేయడంలో పురపాలక యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందనే ఆరోపణలున్నాయి.

**- ముంచుకొస్తున్న ముప్పు..:**
ప్లాస్టిక్ వాడకం వల్ల భూతాపం పెరుగుతుందని పలు అధ్యయనాలు నిగ్గుతేల్చాయి. ప్లాస్టిక్ క్యారీ బ్యాగుల్లోని ఆహార పదార్థాలు తినడం వల్ల ప్రమాదకరమైన కార్సినోజన్లు శరీరంలో చేరి క్యాన్సర్‌కు దారితీస్తుందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇంట్లో మిగిలిన ఆహారం, కూరగాయల వ్యర్థాలు ఈ బ్యాగుల్లో వేసి చెత్త కుండీల్లో వేస్తున్నారు. వీటిని మూగజీవాలు తిని మృత్యువాత పడుతున్నాయి. ప్లాస్టిక్ కాల్చివేయడం వల్ల అందులోని రసాయనాలు వాతావరణంలో కలిసి మానవ, జీవరాశుల మనుగడపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని పర్యావరణ నిపుణులు ఆందోళన చెందుతున్నారు. ప్లాస్టిక్ వినియోగించకుండా ఉండేలా ప్రజల్లో అధికారులు చైతన్యం తీసుకురావాల్సి ఉంది. అలాగే నిషేధిత ప్లాస్టిక్ కవర్లు అందుబాటులో లేకుండా కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉంది. అయితే అధికారులు మాత్రం చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

• వివరాలు 2లో

## రాష్ట్ర అభివృద్ధే మా ప్రభుత్వ లక్ష్యం..

- గడప గడపలో మంత్రి గుమ్మనూరు జయరాం



**ఆలూరు, నవంబరు 10, ప్రభాతవార్త :** ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని, ప్రతి నిరుపేద కుటుంబం ఆనందంగా ఉండాలన్నదే మా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం అన్నారు. గురువారం గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి విచ్చేసిన మంత్రి గుమ్మనూరు జయరాంకు మండల ఎంపిపి జూటూరు హేమలత మారయ్య, వైసిపి మండల కన్వీనర్ గుమ్మనూరు నారాయణ, స్థానిక సర్పంచ్ నీలకంఠల ఆద్వర్యంలో నాయకులు, కార్యకర్తలు పూలమాలలు, మేలతాళ్ళతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాల లబ్దిని తెలియజేసి లబ్దిదారులకు బకెట్లు అందించారు. ఈ సందర్భంగా మంత్రి జయరాం మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాలు, హెల్త్‌క్లినిక్‌లు ఏర్పాటు చేసి గ్రామాల చెంతకే ప్రభుత్వ సేవలు తెచ్చారన్నారు. సిఎం జగనన్న అభివృద్ధి, సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ పాలన సాగిస్తున్నారన్నారు. సంక్షేమ పథకాలలో అవినీతికి తావులేకుండ సంక్షేమ పథకాలను పారదర్శకంగా అమలు చేస్తున్నారన్నారు. అమ్మఒడి, నేతన్ననేస్తం, ఆసరా, రైతుభరోసాలాంటి పథకాలతో ప్రతి కుటుంబం ఈరోజున బాగుపడ్డాయన్నారు. గ్రామాలకు సచివాలయ సిబ్బంది, వాలంటరీలు మూల స్థంబాలలాంటి వారన్నారు. ఏ సమస్య వచ్చినా వెంటనే గ్రామ వాలంటరీ ద్వారా సచివాలయ సిబ్బందికి తెలపాలన్నారు. ఈ రెండు వ్యవస్థలు కూడా ప్రజలతో మంచి సత్సంబంధాలు కలిగి బాగా పనిచేస్తున్నారనే మాట ప్రజలలో కలగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆలూరు వైకాపా ఇంచార్జ్ గుమ్మనూరు నారాయణస్వామి, దేవరగట్టు ఆలయ చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు, మండల ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నారా లోకేష్‌తో మీనాక్షి భేటీ..!



**ఆదోని, నవంబరు 10, ప్రభాతవార్త :** తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌తో ఆదోని నియోజకవర్గ తెదేపా ఇంచార్జ్ కొంకా మీనాక్షినాయుడు గురువారం భేటీ అయ్యారు. నియోజకవర్గ సమస్యలపై, పార్టీలో గ్రూప్ రాజకీయాలపై మీనాక్షితో లోకేష్ చర్చించినట్లు తెలుస్తుంది. పార్టీ సీనియర్‌లు అందరితో త్వరలో తెదేపా అధినేత చంద్రబాబు కూడా సమావేశమవుతున్నట్లు సమాచారం. పార్టీలో అంతర్గత విభేదాలు, రాబోవు సాధారణ ఎన్నికలు ఇత్యాది అంశాలపై పార్టీ అధిష్టానం ఆయా నియోజకవర్గాల ఇంచార్జ్‌లతో ప్రత్యేకంగా సమీక్షిస్తున్న క్రమంలో లోకేష్‌తో మీనాక్షినాయుడు భేటీ అయినట్లు తెలుస్తుంది.

## ప్రతి ఇంటా సంక్షేమ పథకాల పంట..!

- గడప గడప లో ఎమ్మెల్యే కాటసానికి అపూర్వ స్వాగతం
- మరోసారి విజయం వైసీపీదేనంటున్న ఎమ్మెల్యే

**అబ్దులాపురం(కొలిమిగుండ్ల), నవంబరు 10, ప్రభాతవార్త :** వైసీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత గతంలో ఏ ప్రభుత్వం చేయలేని విధంగా ప్రతి ఇంటా సంక్షేమ పథకాల పంట కొనసాగుతోందని బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, పెర్కొన్నారు. గురువారం మండలంలోని అబ్దులాపురం, కోరుమానుపల్లె గ్రామల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కాగా గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో బాగంగా గ్రామాల్లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే కాటసానికి ప్రజల నుండి అపూర్వ స్వాగతం లభిస్తోంది. ఏ గ్రామానికి వెళ్లినా కార్యకర్తలు, నాయకులతో పాటు ప్రజలు సైతం ఎమ్మెల్యేకు స్వాగతం పలుకుతూ వెంట నడుస్తున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని గ్రామంలోని ఇంటింటికి తిరిగి ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలపై ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. వారికి ఇప్పటి వరకు





ప్రభుత్వం నుండి అందిన సంక్షేమ పథకాల లిస్టును ప్రజలకు అందజేశారు. పథకాలను అందని వారిని గుర్తించి, వారికి అందాల్సిన ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు నేరుగా వారి వద్దకు చేర్చిన ఘనత ముఖ్యమంత్రి వైస్ జగన్‌మోహన్‌రెడ్డి దని ఎమ్మెల్యే కాటసాని పెర్కొన్నారు. ప్రజలకు మంచిచేసి, ప్రజల వద్దకు వెళుతున్నామని, ప్రతి కుటుంబం ఆదరిస్తోందని, వచ్చే ఎన్నికల్లో మరోసారి వైసీపీ విజయం తథ్యమని ఆయన పెర్కొన్నారు. పార్టీలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత తమదేనన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మేన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, ఎంపిడిఓ సుబ్బరాజు, తహశీల్దార్ ఆల్‌ఫ్రెడ్, వైసీపీ మండల కన్వీనర్ అంబటి గుర్విరెడ్డి, సత్యాల్ రెడ్డి, పులి ప్రకాశ్‌రెడ్డి, అబ్దులాపురం నారాయణరెడ్డి, శివారెడ్డి, కొండయ్య గౌడు, రామనాథ్‌రెడ్డి మొలక రాజా రెడ్డి, వైస్ ఎంపిపి క్రిష్ణారెడ్డి పలువురు వైసీపీ నాయకులు, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

## భారీ వాహనాల రాకపోకలతో తీవ్ర ఇబ్బందులు..

- ట్రాఫిక్‌జామ్‌తో వాహనదారులకు తప్పని ఇక్కట్లు



**గడివేముల, నవంబర్10, ప్రభాతవార్త ;** భారీ వాహన రాకపోకలతో మండలకేంద్రమైన గడివేములలో నిత్యం ట్రాఫిక్ జామ్ ఏర్పడుతుంది. గడివేములలోని రహదారి ఇరుకుగా ఉంది. జిందాల్ సిమెంట్ ఫ్యాక్టరీకి వచ్చే భారీ వాహనాలు, లారీలు, ఒకటికి ఎదురుగా మరొకటికి అడ్డుగా రావడంతో గురువారంనాడు ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. గడివేములలో భారీ వాహనాలకు రాత్రి సమయంలో మాత్రమే అనుమతులు ఉన్నప్పటికీ పగటిపూట కూడా భారీ వాహనాలు రోడ్లపైకి రావడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతుందని వాహనదారులు వాపోతున్నారు. భారీ వాహనాలు పగలు రోడ్లపైకి రాకుండా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు. అసలే రోడ్లు చిన్నవిగా ఉండడంతో వాహనదారులకు ట్రాఫిక్ సమస్యతో తీవ్ర అంతరాయం ఏర్పడుతుందన్నారు. ఇకనైనా అధికారులు స్పందించి ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చూడాలని వాహనదారులు కోరారు.

## ఆదోనిలో భారీ చోరీ...!

- విచారణ చేపట్టిన పోలీసులు

**ఆదోనిటౌన్, నవంబర్10, ప్రభాతవార్త ;** ఆదోని పట్టణంలోని ఎన్‌జీవోస్ కాలనీలోని రాఘవేంద్ర నగర్‌లో నివాసముంటున్న అబ్దుల్లా ఇంటిలో గత అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఇంట్లో ఎవరూ లేరన్న సమాచారం తెలుసుకున్న దుండగులు పథకం ప్రకారమే చోరీకి పాల్పడినట్లు తెలుస్తోంది. బాధితుడు అబ్దుల్లా తెలిపిన వివరాల మేరకు.... బుధవారం ఫ్యామిలీతో కలిసి తాను బెంగళూరుకు వెళ్లానని తెలిపాడు. ఇంటికి తాళాలు వేసిన విషయాన్ని గమనించిన దుండగులు తాళాన్ని పగలగొట్టి ఇంట్లోకి ప్రవేశించారు. రెండు బీరువాలను పగలగొట్టారు. అందులో ఉన్న 17 తులాలబంగారు ఆభరణాలు, 75 తులాల వెండిఆభరణాలు, రూ. 80 వేలు నగదును దొంగలు ఎత్తుకెళ్లినట్లు త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు. బాధితుడిఫిర్యాదు మేరకు విచారణ చేస్తున్నామని సీఐ చంద్రబాబు తెలిపారు. దొంగలను



పట్టుకునేందుకు స్పెషల్ పార్టీని రంగంలోకి దింపామన్నారు. కర్నూలు నుంచి డాగ్ స్క్వాడ్, క్లూస్ టీంను రప్పించినట్లు చెప్పారు.

## ఫ్లాష్ ఫ్లాష్..

### సబ్ రిజిస్టర్ సస్పెండ్

**- అవినీతి ఆరోపణలుతో అరెస్ట్ అయిన సబ్ రిజిస్టర్ సస్పెండ్**

**కర్నూల్ ప్రభాతవార్త ప్రతినిధి :** అవినీతి ఆరోపుణ లతో అరెస్ట్ అయిన కల్లూరు సబ్ రిజిస్టర్ అరెస్ట్ అయ్యి 48 గంటల జ్యూడిషియల్ కస్టర్డ్ లో ఉన్నందువలన.. డిస్టిక్ రిజిస్టర్ గారు ఈరోజు సస్పెండ్ చేయడం జరిగినది. వివరాలు తెలియాల్సి ఉన్నది.

# ఏసీబీ కక్ష కట్టిందా..?

**(మొదటి పేజీ తరువాయి)** మరో దశలో అతనిపై ఫిర్యాదులు ఎక్కువగా ఉన్నాయని చెప్పారు. ఫిర్యాదులు వస్తే ఆధారాలు ఉన్నాయా ? ఈ కేసులో ఉస్మాన్ భాష అనే వ్యక్తి అనిల్ కుమార్‌పై ఫిర్యాదు చేసినట్లు ఎఫ్ఐఆర్‌లో నమోదు చేశారు. ఆకస్మిక తనిఖీలు జరిగిన రోజు సదరు ఉస్మాన్ రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. అప్పటి ఆకస్మిక తనిఖీలలో కల్లూరు సబ్ రిజిస్టర్ కార్యాలయంలో రూ.59,000 డబ్బు ఏసీబీ అధికారులకు సీజ్ చేశారు. అందులో 40 వేల రూపాయలు ఆఫీసు లో ఒక బీరువా వెనక దాచి ఉంచారు. మిగిలిన మొత్తం అక్కడికి వచ్చిన డాక్యుమెంట్ రైటర్లకు సంబంధించిన వారి నుండి తీసుకున్నారు. కాగా 40 వేల రూపాయలకు ఎలాంటి లెక్కలేదు. ఎవరి డబ్బు తెలియదు అని అప్పట్లో రికార్డు చేశారు. ప్రస్తుతం రూ.40000 రూపాయలలో పదివేల రూపాయలు ఉస్మాన్ లంచం ఇచ్చినట్లు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఏడు నెలల తర్వాత ఫిర్యాదు రావడం ఏంటి ? ఫిర్యాదు పై విచారణ లేకుండా ప్రభుత్వ అధికారిని హఠాత్తుగా అరెస్టు చేయడం ఏంటి ? అన్న ప్రశ్నలు బాగా వినిపిస్తున్నాయి 40 వేల రూపాయలలో పదివేల రూపాయలకు ఉస్మాన్ 7 నెలల తర్వాత వచ్చి ఫిర్యాదు చేశాడు. అది ఎంతవరకు నిజం అన్న విషయం పక్కనబెట్టి ఎఫ్ఐఆర్ కేసు నమోదు చేశారు. మరో సంవత్సరానికి మరొకరు మరో రూ.10,000 ఇచ్చామని వస్తే అప్పుడు కేసు పెడతారా ? ఆపై సంవత్సరం మరొకరు రూ.10000 ఇచ్చాను అంటే అప్పుడు కేసు పెడతారా ఇలా 40 వేలకు నాలుగు సార్లు నాలుగు సంవత్సరాల లేదా 40 సంవత్సరాలకు కేసులు కడతారా అన్న ప్రశ్న బహిరంగంగానే వినిపిస్తోంది. ఫిర్యాదు చేయడం ప్రతి ఒక్కరి హక్కు. దానిని కచ్చితంగా విచారించి తగిన ఆధారాలు ఉన్నాయనుకుంటేనే కేసు కట్టడం అధికారుల పని. కానీ ఇక్కడ ఫిర్యాదారుడు మంచి దైవభక్తి ఉన్న వ్యక్తి, అరుణ్ కుమార్ అరెస్టుకు కారణం తానే అన్న విషయం తెలిసినప్పటి నుంచి చాలామంది దగ్గర తానేమి చేయలేదని ఏసీబీ అధికారులు ఫోన్ చేస్తే కార్యాలయానికి వెళ్లానని బలవంతంగా సంతకం పెట్టించారని వాపోతు న్నారు. ఇంకో విషయం ఏమిటంటే కంప్లైంట్ ఇచ్చిన వ్యక్తి సబ్ రిజిస్ట్రార్‌తో మంచి సత్సం బంధాలు కలిగి ఉండేవాడు. ఏది ఏమైనా ఈ కేసులో ఏసీబీ అధికారుల ప్రతి చర్య ప్రశ్నార్థకంగా మారింది. కల్లూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సబ్ రిజిస్ట్రార్‌ను మార్చేందుకే జరిగిన కుట్ర ఇదని కొందరు రిజిస్ట్రేషన్ శాఖకు చెందినవారు చెబుతున్నారు. ఇక ఉద్యోగ సంఘాల నాయకులు ఈ విషయంపై ప్రభుత్వానికి ఫిర్యాదు చేసే పనిలో ఉన్నారు. అంతేగాక న్యాయ నిపుణుల సలహాలు తీసుకుంటున్నారు. ఏది ఏమైనా ఏడు నెలల తర్వాత కేసు నమోదు చేసి అరెస్టు చేయడంపై తీవ్ర స్థాయిలో చర్చ జరుగుతుంది.

**వివరణ :** ఈ విషయంపై ఏసీబీ డిఎస్పి శివ నారాయణ స్వామిని ప్రభాతవార్త వివరణ కోరడం జరిగింది. ఈ కేసులో ఎలాంటి విమర్శలకు తావు లేదని డిఎస్పి అన్నారు. తాము జరిపిన ఆకస్మిక తనిఖీలలో పట్టుబడిన సొమ్ముపై ఉస్మాన్ వచ్చి ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు మేరకే కేసు నమోదు చేశామన్నారు. ప్రస్తుతం ఫిర్యాదుదారుడు తనతో బలవంతంగా సంతకం పెట్టించారని అంటున్నాడన్న ప్రశ్నకు సమాధానమిచ్చారు. ఎవరైనా పోలీసులకు స్టేట్మెంట్ ఇచ్చామని బయట చెప్పరు. తమకేమీ తెలియదని చెబుతారు, ఇక్కడ ఈ కేసులో కూడా అతను ఇక్కడ తనంతట తానుగా ఫిర్యాదు చేశారన్నారు. ఇక స్వార్థ ప్రయోజనాలతో అరుణ్ కుమార్‌ను ఆ స్థానం నుంచి పంపేందుకు ఒత్తిళ్లు వచ్చాయా అన్న విషయానికి ఆయన స్పందించారు. ఎలాంటి ఒత్తిళ్లు లేవని కేసులో ఫిర్యాదు వస్తే తప్పక చర్యలు తీసుకుంటామన్నారు. ఏడు నెలల ఆలస్యంగా కేసు నమోదు చేయడం ఏమిటన్న ప్రశ్నకు ఆయన సమాధానం ఇస్తూ ఇక్కడ సమయం ముఖ్యం కాదు దొరికింది లంచము సొమ్ము అన్న విషయం స్పష్టంగా తెలుస్తుందన్నారు. అయితే ఆ లంచం ఇచ్చింది ఎవరన్న విషయంలో స్పష్టత లేక ఆలస్యమైందన్నారు. చివరగా రాష్ట్రవ్యాప్తంగా దాడులు జరిగితే ఒక్క కల్లూరు సబ్ రిజిస్టర్‌ను మాత్రమే అరెస్టు చేశారా అనే విషయంకు ఫిర్యాదు చేస్తే ఎక్కడైనా ఏసీబీ అధికారులు అరెస్టు చేయడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు. అంతేగాక ఈ కేసులో ఫిర్యాదుదారుడు కూడా తనకు సంబంధం లేదంటున్నాడు. ఇక లంచం ఇచ్చాడనడానికి సాక్షులు లేరు. ఈ కేసు కోర్టులో నిలుస్తుందా అన్న విషయంపై ఆయన కచ్చితంగా కోర్టులో నిలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

## సీఎం సార్ రైతుల కన్నీటి కష్టాలు కనిపించడం లేదా

**(మొదటి పేజీ తరువాయి)** టమోటా రైతుల పెట్టుబడులు వేలల్లో ఉంటే పండిన పంటకు గిట్టుబాటు ధర లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వారిని రోడ్డు పాలు చేసిన ఘనత జగన్‌కి దక్కిందన్నారు. రైతు భరోసా కేంద్రాల వల్ల రైతులకు జరిగిన మేలు ఏమి లేదన్నారు. రైతులు ఇంత ఇబ్బందులు పడుతుంటే కనీసం పరామర్శించేందుకు కూడా స్థానిక ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి రాలేదని ఆయన విమర్శించారు. మరో వారం రోజులు పోతే ఇక పత్తి రైతులు కూడా ఆకాశం వైపు చూడాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని జగన్ అరాచకం చూసి వరున దేవుడు కూడా వర్షం కురియాల్సిన సమయంలో కురియకుండా కురువ కూడనిసమయంలో కురుస్తున్నాడని ఆయన ఎద్దేవ చేశారు. టీడీపీ హయంలో ఆర్డీఎస్‌ను తీసుకువస్తే రివర్స్ టెండర్ అంటు నిలిపివేశారు. ప్రభుత్వం ఏర్పడి మూడేళ్లు అవుతున్నప్పటికి ఆర్డీఎస్ పనులు ఎందుకు మొదలు పెట్టలేదని ప్రశ్నించారు. ఆర్డీఎస్ పూర్తి అయి ఉంటే ఆదోని డివిజన్‌లో చాలా బాగం పంటపొలాలకు నీరు అంది సశ్యశ్యామలంగా భూములు ఉండేవని ఆయన వివరించారు. ఇప్పటికైన ప్రభుత్వం స్పందించి ఉల్లి, టమోటా తో పాటు ఇతర పంటకు కూడా గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. గోనెగండ్లలో తాగునీటి సమస్యను పరిష్కరించాలి-మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి మండల కేంద్రమైన గోనెగండ్లలో నెలకున్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని బీవీ డిమాండ్ చేశారు. గోనెగండ్ల వీదుల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్ఎస్ ట్యాంక్ నిర్వహణ వైసిపికి చెందిన కాంట్రాక్టర్‌కు ఇచ్చినందుకు టీడీపీ సర్పంచ్‌కు ప్రజలలో చెడ్డ పేరు తీసుకువచ్చేందుకు గాను గ్రామనికి సకాలంలో నీటి విడుదల చేయకుండా నాలుగు రోజులకు ఒక సారి నీటిని విడుదల చేస్తున్నారని ఆయన అన్నారు. సర్పంచ్ హైమావతి మాట్లాడుతూ సర్పంచ్‌గా గెలిచానే గాని గ్రామ ప్రజలకు ఎలాంటి సేవలు చేయలేక పోతున్నారని అన్నారు. పంచాయితీలో ఉన్న డబ్బులు మొత్తం సీఎం జగన్ తీసివేసుకుంటే మేమే ఏమి పనులు చేయాలని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పి.హైమావతి, చంద్రశేఖర్, మండల కన్వీనర్ నజీర్‌సాహెబ్, మండల ప్రధాన కార్యదర్శి తిరుపతయ్యనాయుడు, నూరఅహ్మద్, బేతాళ బడేసాబ్, మండల ఉపాధ్యక్షులు కులుమాల రాముడు, ఫకృద్దిన్, (చంటి)భారతం రహంతుల్లా ,శ్రీధర్‌నాయుడు, మదీనా, రామాంజినేయులు, ఫకృద్దీన్, రామేష్‌నాయుడు, నాగరాజు, మిన్నల్లా, అబ్దుల్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## తూతూ మంత్రం.. ప్లాస్టిక్ నిషేదం..!

**(మొదటి పేజీ తరువాయి)**

**- ఎమ్మిగనూరులో జోరుగా ప్లాస్టిక్ విక్రయాలు..!**

ఎమ్మిగనూరు పట్టణంలోని శకుంతల సర్కిల్, గోనెగండ్ల రోడ్డు నందు కొంత మంది వ్యాపారస్థులు ప్లాస్టిక్ విక్రయాలు జోరుగా సాగిస్తున్నారు. ఇతర రాష్ట్రం నుండి వచ్చిన కొంతమంది వ్యాపారులు దాదాపు లక్షలు విలువ చేసే ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులను నిల్వ ఉంచినట్లు సమాచారం. స్థానికంగా ఉంటూ ఏళ్ల తరబడి ప్లాస్టిక్ వ్యాపారం చేసే వ్యక్తులు నేరుగా దుకాణాల దగ్గరకు వెళ్లి సరఫరా చేస్తున్నారు. లేదా తమ స్వగృహాల నందు గుట్టుచప్పుడుగా ప్లాస్టిక్ విక్రయాలు చేస్తున్నట్లు సమాచారం. ఈ వ్యాపారం గత కొన్నేళ్లుగా కొనసాగిస్తున్నా సంబంధిత మునిసిపల్ అధికారులు చర్యలు తీసుకోవడంలో విఫలమైయ్యారని ప్రజలు చర్చించుకుంటున్నారు. గతంలో ఈ ప్లాస్టిక్ వ్యాపారిపై మునిసిపల్ అధికారులు దుకాణంలో తనిఖీలు చేసి జరిమాన విధించి సాగనంపడంతో తిరిగి తన ప్లాస్టిక్ వ్యాపారిన్ని కొనసాగిస్తున్నాన్నట్లు సమాచారం. ఉదయం లేచింది మొదలు రాత్రి వరకు కిరాణ దుకాణాలకు, మాంసపు దుకాణాలకు, కూరగాయల మార్కెట్ వ్యాపారస్థులకు, ఫంక్షన్లకు నేరుగా తన ద్విచక్ర వాహనంపై తీసుకెళ్లి సరఫరా చేస్తూ తన వ్యాపారం మూడు గ్లాసులు..ఆరు ప్లాస్టిక్ కవర్లుగా వీరాజిల్లుతుందని ప్రజలు చర్చించుకుంటున్నారు. పట్టణ నడిబోడ్డున దుకాణం ఏర్పాటు చేసుకొని గుట్టు చుప్పుడుగా ప్లాస్టిక్ కవర్ల వ్యాపారం చేస్తున్నాడని ఆరోపణలు ఉన్నాయి. దీనికి తోడు తేరుబజారులో నివాసం ఉండే ఓ యువకుడు ఏకంగా స్వగృహం నందు లక్షల విలువ చేసే ప్లాస్టిక్ కవర్లు, గ్లాస్‌లను నిల్వ చేసుకొని భహిరంగంగానే వ్యాపారం చేస్తున్నా సంబంధిత అదికారులు చూసిచూడనట్లు వ్యవహరించడం పట్ల పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ప్లాసిక్ విక్రయాలను ఆరికట్టాలంటే ముందుగా ఈ ప్లాస్టిక్ వ్యాపారులకు కళ్లెం వేయాలని ప్రజలు కోరుతున్నారు.

## రైతులు యాజమాన్య పద్ధతులు పాటించండి

**కోవెలకుంట్ల, నవంబరు 10, ప్రభాతవార్త :** రైతులు వ్యవసాయ అదికారుల చెప్పే యాజమాణ్య పద్దతులు పాటిస్తే దిగుబడులు మంచిగా వస్తాయని యాగంటిపల్లె కృషి విజ్ఞానకేంద్ర శాస్త్ర వేత్త బాలరాజు కోరారు. గురువారము ఉయ్యాలవాడలో పొలంబడి కార్యక్రమముపై రైతులకు ఎడిఎ నిరంజన్‌తో కలిసి ఒక రోజు శిక్షణాశిబిరమును నిర్వహించారు. ఈసందర్బముగా రైతులను ఉద్దేశించి శాస్త్ర వేత్త బాలరాజు మాట్లాడుతూ రైతులు వ్యవసాయ అదికారులు చెప్పే వాటిలో కొంత మేరకైన పాటిస్తే వారు సాగు చేసిన పంటలకు మంచి దిగుబడులు వస్తాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎఓ పద్మావతి, చక్రదరరెడ్డి మాస్టర్ ఫైనార్స్ ప్రసాదరావు, రఘువరన్, తదితరులు పాల్గొన్నారు.

## ఈరన్నస్వామి వారి రాజగోపురం నిర్మాణానికి విరాళం

కౌతాళం, నవంబర్10, ప్రభాతవార్త ; మండలంలోని ఉరుకుంద ఈరన్నస్వామి (లక్ష్మినరసింహస్వామి) దేవస్థానం రాజగోపురం నిర్మాణానికి ఎమ్మిగనూరుకు చెందిన ఎ.వీరేష్ మరియు ఎ.కృష్ణ రూ.50,116 విరాళాన్ని గురువారం అందజేశారు. దాతలకు దేవస్థాన ఆలయ అధికారులు, స్వామివారి దర్శనం కల్పించి ఆశీర్వాలు, స్వామివారి శేష వస్త్రాలు, లడ్డూ ప్రసాదాలు, బాండును అందించి పూలమాలతో సత్కరించారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ స్వామవారి రాజగోపురం నిర్మాణానికి విరాళం అందించాలని మొక్కుకోవడం జరిగిందన్నారు. ఇందులో భాగంగానే అందించామన్నారు. మున్ముందు కూడా స్వామివారి ఆలయ అభివృద్ధికి తమవంతు సహాయ, సహకారాలు అందించేందుకు తాము ఎల్లప్పుడూ సిద్దంగా ఉంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రధాన అర్చకులు ఈరన్నస్వామి, దేవస్థాన సిబ్బంది హెచ్.నాగరాజుగౌడ్ ఉన్నారు.

## అగ్ని ప్రమాదాలపై ఆపద మిత్రలకు అవగాహన

**కర్నూలు జిల్లా పరిషత్, నవంబర్ 10, ప్రభాతవార్త :** అగ్ని ప్రమాదాలు, భవనాలు కూలినప్పుడు, సునామీ, భూకంపాలు సంభవించినప్పుడు ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అప్రమత్తం చేసేందుకు ఆపద మిత్రలకు 4వ రోజు ఆయా డిపార్టుమెంట్లు గురువారం అవగాహన కల్పించాయి. ఆపద సమయంలో సాంకేతికంగా, తీసుకోవలసిన పద్దతులను వాలంటీర్లకు ప్రాక్టీస్, డెమో ద్వారా వారికి అవగాహన కల్పించారు. సాంకేతికంగా 1.రోప్ టెక్నిక్, 2. గ్యాస్ సిలిండర్ అంటుకున్నప్పుడు ఎలా ఆర్పాలి. 3. వాటర్ టెండర్ ఉపయోగం, రెస్క్యూ మెథడ్ తదితర వాటి గురించి ఫైర్ డిపార్టుమెంట్ నుంచి రామాంజనేయులు, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ ఎమ్మిగనూరు దినకరన్‌బాబు, పత్తికొండ అధికారి గోపాలకృష్ణ, హర్షవర్ధన్ తదితరులు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా ఫైర్ ఆఫీసర్ అవినాస్ జయసింహ మాట్లాడుతూ మాట్లాడుతూ రెండేళ్ల క్రితమే ఆపద మిత్రలకు శిక్షణ జరగాల్సిన ఉండగా కరోనా కారణంగా వాయిదా వేసి ఇప్పుడు నిర్వహిస్తున్నామన్నారు. ఆపద సమయంలో మిత్రలుమీ ఏరియాల్లో సిద్ధంగా ఉండి ఆపదలను నివారించడానికి ప్రయత్నించాలని సూచించారు. కార్యక్రమంలో డిపిఎం శ్రీ అనుపమ, ట్రైనింగ్ మేనేజర్ గిడ్డేష్, డిపిఆర్‌సిలు రాజవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ పత్తివిత్తనాల వల్ల నష్టపోయిన రైతులకు న్యాయం చేయాలి

**- ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు రామకృష్ణ**

**కర్నూలురూరల్, నవంబర్10, ప్రభాతవార్త:** నకిలీ పత్తివిత్తనాల వల్ల నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50వేలు ఇవ్వాలని నకిలీ పత్తి విత్తనాల కంపెనీ యజమానులతో కుమ్మక్కైన వ్యవసాయాధి కారులను అరెస్ట్‌చేసి వారి లైసెన్స్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ముందు పెద్దఎత్తున ఆందోళన నిర్వహించి రైతులు గంటలతరబడి ఆందోళన



చేసినా ఎవరు స్పందిం చకపోవడంతో ఎన్టీఆర్ కూడలి నందు రోడ్లను దిగ్బంధనం చేశారు. పోలీసులు జోక్యం చేసుకుని వ్యవసాయాధికారులతో మాట్లాడిస్తామని హామీ ఇచ్చిన తరువాత రోడ్ల దిగ్బంధనం విరమించి కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన తెలిపారు. అనంతరం వ్యవసాయా శాఖ జేడీ వచ్చి రైతులకు న్యాయం చేస్తామని, కంపెనీ యజమానుల పై కఠిన చర్యలు తీసుకుంటామని, నష్టపోయిన రైతులకు న్యాయం జరిగేలా ప్రభుత్వంతో చర్చిస్తామని జేడీ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కర్నూలు, కల్లూరు మండలాల రైతులు, రైతు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## ఎస్సి కమీషన్ చైర్మన్‌ను కలిసిన దళిత సంఘాల నాయకులు

**పత్తికొండ, నవంబరు 10, ప్రభాతవార్త :** మాలమహానాడు, ఎమ్మార్పీఎస్, కెవిపిఎస్ నాయకులు రాష్ట్ర ఎస్సి కమీషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్‌ను గురువారం స్థానిక ఆర్అండ్‌బి గెస్ట్‌హౌస్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా దళిత సంఘాల నాయకులు నరసప్ప, సాయిరాం, సుధాకర్, రంగన్న, సురేంద్ర, రమేష్‌లు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో మాదాసి-మాదారి కురువలు లేరని రాష్ట్ర ప్రభుత్వం 53జీఓను రద్దు చేయాలని ఎస్సి కమీషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్‌కు తెలియజేసినట్లు తెలిపారు. ఈ ప్రాంతంలో మాదాసి-మాదాసి కురువలు లేరని పక్కరాష్ట్రం కర్ణాటక నుండి అనంతపురం, కర్నూలు జిల్లాలకు కురుబలు వలసలు వచ్చారని కురుబలు మాదాసి-మాదారి కురువలు అని చెప్పు కుంటూ సర్టిఫికేట్లు పొందేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తున్నారన్నారు. కురుబలను ఎస్సి జాబితాలో ఎలా చేరుస్తారని ఎస్సి ఉపకులాలకే న్యాయం చేయడం లేదన్నారు. కురుబ వాళ్లు మాదాసి-మాదారి కురువలు అని వక్రీకరించుకుని ఎస్సి సర్టిఫికేట్లు పొందడం సరైంది కాదన్నారు. కావున ఈ విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ఎస్సి కమీషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్‌కు వినతిపత్రం అందచేశారు.

## గీత కార్మికుల కృతజ్ఞతలు.. సిఎం చిత్రపటానికి పాలాభిషేకం

**కొలిమిగుండ్ల, నవంబరు 10, ప్రభాతవార్త :** ఇటీవల రాష్ట్రంలో కల్లుగీత కార్మికుల సమస్యలను పరిష్కరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన రెడ్డి ప్రకటించడం పట్ల వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు. కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కొండయ్యగౌడు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సమక్షంలో గురువారం



కొలిమిగుండ్ల మండలంలోని అబ్దులాపురం గ్రామంలో ముఖ్యమంత్రి జగన్ చిత్రపటానికి పాలాభిషేక ం చేశారు. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సమక్షంలో ముఖ్యమంత్రికి, రాష్ట్ర మంత్రి జోగి రమేష్, ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఎన్నో ఎళ్లుగా కల్లుగీత కార్మికులు ఎదుర్కొంటున్న వివిధరకాల పన్నులు ఎత్తి వేయడంతో పాటు గీత కార్మికులకు ఇన్సూరెన్స్ కల్పించడం అభినందనీయమని వారు పెర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కొండయ్య గౌడు, శంకరయ్యగౌడు, ఎంపిడిఒ సుబ్బరాజు, సర్పంచ్ మొలక రాజారెడ్డి, నారాయణరెడ్డి, సత్యాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు నారాయణ కాలేజీ విద్యార్థిని ఎంపిక..

**కోసిగి, నవంబరు 10, ప్రభాతవార్త :** రాష్ట్రస్థాయిలో జరిగే ఖోఖో పోటీలకు సీనియర్ విభాగం నుండి కోసిగి నారాయణ కళాశాల విద్యార్థిని భాగ్యమ్మ ఎంపికైనట్లు ప్రిన్సిపల్ ఉసేనయ్య, షేక్షావలి, చౌడయ్యలు తెలిపారు.. అక్టోబరు నెలలో కర్నూలు కేంద్రంగా జరిగిన ఖోఖో ఎంపికలో కోసిగి నారాయణ జూనియర్



కళాశాలకు చెందిన భాగ్యమ్మ అత్యుత్తమ ప్రతిభను కనపరిచడంతో రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు..ఇందులో భాగంగా ఈ నెల 11వ తేది నుండి 13వ తేది వరకు ప్రకాశం జిల్లా ఈదరలో జరిగే రాష్ట్రస్థాయి ఖోఖో జట్టులో జిల్లా తరుపున పాల్గొంటుందని తెలిపారు.. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయికి ఎంపికైన భాగ్యమ్మను కళాశాల అధ్యాపక బృందం బాలాజి, కాడయ్య, పిడి బాలకృష్ణ, ఇస్మాయిల్, తదితరులు అభినందించారు..

## సామాజిక పురోగతికి గ్రంథాలయాలు సోపానాలు..

**- జాతీయ గ్రంథాలయ వారోత్సవాల పోస్టర్లు విడుదల..**

**కోసిగి, నవంబరు 10, ప్రభాతవార్త :** జీవన వికాసానికి, సామాజిక పురోగతికి గ్రంథాలయాలు సోపానాలుగా నిలుస్తాయని వ్యవసాయ మండలి కోసిగి మండల అధ్యక్షులు మురళీమోహన్‌రెడ్డి అన్నారు.. గురువారం స్థానిక గ్రంథాలయ ఆవరణంలో లైబ్రేరియన్ ఆశాజ్యోతి అధ్యక్షతన 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల



పోస్టర్లను విడుదల చేసారు.. ఈ సందర్బంగా ఎంపీపీ లవకుశ ఈరన్న, సింగల్‌విండో అధ్యక్షులు మఠం మహాంతేష్‌స్వామి ముఖ్య అతిథులుగా హాజరయిన ఈ కార్యక్రమంలో మురళీమోహన్‌రెడ్డి మాట్లాడుతూ వివేకవంతమైన తరాన్ని సమాజాన్ని రూపొందించడంలో గ్రంథాలయాలు అవిరామ కృషి కొనసాగిస్తున్నాయన్నారు.. ముఖ్యంగా విద్యావంతులకు విజ్ఞానాన్ని పెంపొందించడంతో పాటు మానవ పరిమాణాన్ని ఆవిష్కస్తున్నాయన్నారు.. గ్రంథాలయాలు అందిస్తున్న సేవలను ప్రజలకు తెలియజేయడం, నేటి తరాన్నికి గ్రంథాలయాలను సన్నిహితం చేయడమే ధ్యేయంగా గ్రంథాలయాల వారోత్సవాలను జరుపుకుంటున్నారన్నారు..ఇందులో భాగంగా ఈ నెల 14వ తేది నుండి 20వ తేది వరకు వివిధ దశలలో ఈ వార్సోవాలను నిర్వహిస్తున్నట్లు లైబ్రేరియన్ ఆశా జ్యోతి తెలిపారు..ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు ప్రవీణ్‌కుమార్, వెంకటేష్, నరసింహులు విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు..

## మృతి చెందిన జర్నలిస్టు కుటుంబాలకు అండగా ఏపియూడబ్ల్యూజే

**- వీరేష్ కుటుంబానికి 50 వేలు ఆర్థిక సహాయం**

**ఎమ్మిగనూరు క్రైం నవంబర్ 10 ప్రభాతవార్త:** ఎమ్మిగనూరు పట్టణ విలేకరి వీరేష్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసిందే. ఏపియూడబ్ల్యూజే ఎమ్మిగనూరు తాలుకా సమితి అధ్వర్యంలో గురువారం మృతుడు వీరేష్ భార్య గీతాంజలికు రూ.50 వేలు ఆర్థిక సహాయం అందచేవారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ జాతీయ సమితి సభ్యులు కొండప్ప, ఎమ్మిగనూరు తాలుకా నాయకులు శ్రీనివాస నాయుడు, బిజి పరమేష్, జిల్లా ఉపాధ్యక్షులు జాలవాడి బాష, జిల్లా సహయ కార్యదర్శి నూర్ అహమ్మద్, శివ, వీ.రామకృష్ణ అధ్వర్యంలో ఆర్థిక సహాయాన్ని అందచేశారు. ఎవరైనా జర్నలిస్టులు మరణిస్తే వారి కుటుంబ సభ్యులకు భరోసా ఇవ్వడానికి ఏపియూడబ్ల్యూజే ఎప్పుడు ముందుంటుందని తెలిపారు. భవిష్యత్తులో జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తుందన్నారు. వీరేష్ కుటుంబానికి ఆర్థిక సహాయం చేసేందుకు ముందుకు వచ్చిన ప్రతి జర్నలిస్టులకు ధన్యవాదాలు తెలిపారు. ఈకార్యక్రమంలో ఏపియూడబ్ల్యూజే నాయకులు బజారప్ప, ఈరన్న, ఆశోక్, నాగరాజు, బాలరాజు, సోమన్న, నాగభూషణం, రవి, ఎల్లయ్య ఆచారి, లక్ష్మన్న, తదితరులు పాల్గొన్నారు.



## గ్రంథాలయ వారోత్సవాలను విజయవంతం చేయండి

**వెల్దుర్తి, నవంబర్10, ప్రభాతవార్త :** జిల్లా గ్రంథాలయ సంస్థ ఆదేశాల మేరకు ప్రతి ఏడాది నిర్వహించే గ్రంథాలయ వారోత్సవాలను విజయవంతం చేయాలని వెల్దుర్తి శాఖ గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ఛైర్మెన్ తిరివీధి సాయిప్రసాద్ అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో గురువారం గ్రంథాలయాధికారిణి కవితబాయి అధ్యక్షతన కమిటీ సభ్యులు వి.యం.హరిసింహానాయుడుతో కలిసి 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలకు సంబంధించి పోస్టర్‌ను వారు విడుదల చేశారు. ఈ సందర్భంగా సాయిప్రసాద్



మాట్లాడుతూ ఈనెల 14 నుంచి 20వ తేది వరకు వారోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులకు పలు అంశాలపై పోటీ పరీక్షలు నిర్వహించి ముగింపు రోజున బహుమతులు అందజేస్తామన్నారు.

## నాడు-నేడు పనులను పరిశీలించిన ఏపీఎం

**సిబెళగల్, నవంబర్10, ప్రభాతవార్త:** సిబెళగల్ మండల పరిధిలోని బురాన్‌దొడ్డి, మారాన్‌దొడ్డి గ్రామాల్లోని స్కూళ్లకు నాడు-నేడు కింద మంజూరైన పనులను గురువారం ఏపీఎం వెంకటస్వామి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన హెచ్ఎంలతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పిల్లల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని కార్పొరేట్ స్కూళ్లకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతున్నట్లు చేపటేటువంటి పనులలో నాణ్యత లోపించకుండా నిబంధనల ప్రకారం పనులను చేపట్టాలని ఆయన తెలిపారు. అనంతరం పాఠశాలలో జగనన్న గోరుముద్ద పథకాన్ని పరిశీలించారు. వంట ఏజెన్సీతో ఆయన మాట్లాడుతూ విద్యార్థిని, విద్యార్థులకు ప్రభుత్వం నిర్ణయించిన మెనూ ప్రకారమే భోజనాన్ని ఏర్పాటు చేయాలని వారిని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్ ధరణి, రంగన్న, పాఠశాల హెచ్ఎంలు తదితరులు ఉన్నారు.

## నేడు యాగంటి ఆలయంలో వేలంపాట

**బనగానపల్లె, నవంబర్10, ప్రభాతవార్త:** మండలంలోని ప్రముఖ శైవక్షేత్రమైన యాగంటిలో వెలసిన శ్రీ ఉమామహేశ్వరస్వామి దేవస్థానం నందు ఈనెల 11న తేదిన కొబ్బరి చిప్పలు ప్రోగు చేసుకునేందుకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో బి.చంద్రశేఖర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల పాటదారులు రూ.5వేలు డిపాజిట్ చెల్లించి శుక్రవారం ఉదయం 10 గంటలకు ఆలయ ఆవరణంలో జరుగు వేలంపాటలో పాల్గొనాలని ఆయన తెలిపారు. హెచ్చుపాటదారుడు వెంటనే నగదు చెల్లించాలని ఈవో తెలియజేశారు.

## కార్మికుల హక్కులను కాలరాస్తే ఉద్యమం ఉధృతం చేస్తాం

**మిడుతూరు, నవంబర్10, ప్రభాతవార్త ;** కార్మికుల హక్కులను కాలరాస్తే ఉద్యమం ఉధృతం చేస్తామని సీఐయూటీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.నాగరాజు, జిల్లా కమిటీ కార్యవర్గసభ్యులు కె.భాస్కర్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు గురువారం మిడుతూరులోని స్కూల్‌లో సీఐటీయూ మండల మహాసభ లింగ స్వామి అధ్యక్షతన నిర్వహించారు. స్కీం వర్కర్స్‌కి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కనీస





వేతన చట్టం వెంటనే సవరించాలన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా వేతన కోసం పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం రూ.26 వేలు ఇవ్వాల్సారు. ఈసైటీయూ మండల కార్యదర్శి జి.నాగమణి,, కార్యదర్శి నివేదిక ప్రవేశపెట్టడం జరిగింది. అనంతరం మండల నూతన కమిటీని 25 మందితో ఎన్నుకోవడం జరిగింది. కార్మికవర్గానికి అందించిన కార్మిక వర్గ గొడుగులాంటిది సీఐటీయూ అని చెప్పారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ, ఆశావర్కర్లు, స్వచ్ఛభారత్ స్కావెంజర్స్, మధ్యాహ్న భోజనం, వీఆర్ఏ, వీఓఏలు తదితరులు పాల్గొన్నారు.

**- మండల నూతన కమిటీ ఎన్నిక :** మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇందులో అధ్యక్షులుగా లింగస్వామి, ఉపాధ్యక్షులుగా శ్రీను, కార్యదర్శిగా జి.నాగమణి, సహాయ కార్యదర్శిగా వెంకటశివుడు, సులోచన, సుబ్బమ్మ, శకుంతలమ్మ, కోశాధికారిగా ప్రభాకర్‌లను ఎన్నుకున్నారు.

## గోనెగండ్ల ఏపీడబ్ల్యుజేయూ నూతన కమిటీ ఎన్నిక

**గోనెగండ్ల నవంబరు 10 ప్రభాతవార్త :** గోనెగండ్ల మండల ఏపీడబ్ల్యుజేయూ నూతన కమిటీ గురువారం ఏకగ్రీవంగా ఎన్నిక జరిగినట్లు సంఘం జిల్లా నాయకులు పరమేష్, శ్రీనివాసులు, నూరఅహ్మద్, భాష, తెలిపారు. గోనెగండ్ల మండల అధ్యక్షుడిగా నగిరి అక్బర్, ఉపాధ్యక్షుడుగా కరుణాకర్, ప్రధాన కార్యదర్శిగా ఈశ్వర్, సహాయ కార్యదర్శిగా షఫిభాష, కోశాధికారిగా ఎన్‌వీ బాబునాయుడు, అర్గనైజింగ్ కార్యదర్శిగా కడియాల వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ గోనెగండ్ల లోని జర్నలిస్టులకు ఇంటి స్థలాలు, సామాజిక పింఛన్‌లను ప్రభుత్వం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కట్టుబడి ఖలీల్, రామకృష్ణ, సోమన్న, జాలువాడి భాష, నందవరం ఏపీడబ్ల్యుజే మండల అధ్యక్షులు ఉపే ంద్రరెడ్డి, రాజు పాల్గొన్నారు.

## నాడు నేడు పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

**కోడుమూరు, నవంబర్ 10,(ప్రభాతవార్త) :** మండలంలోని ఆయా ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న నాడు నేడు పనులను అనుకున్న సమయానికల్లా పూర్తి చేయాలని కోడుమూరు మండల విద్యాధికారి అనంతయ్య సూచించారు. గురువారం మండలంలోని 54 ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతి ఏటా విడుదల చేస్తున్న నాడు నేడు నిధులతో పాఠశాలల్లో జరుగుతున్న పనులల్లో నాణ్యత లోపించరాదన్నారు. అంతే గాక ప్రభుత్వం సూచించిన సమయంల్లోగా అధ్యాపక బృందం పాఠశాలకు చేరుకోవాలన్నారు. ప్రతి పాఠశాలలో తప్పని సరిగా ఫిర్యాదుల బాక్సులను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఎపిఎం పుస్పవతి, తాహశీల్దార్, ఎంపిడివో చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## జీవో 21 ని రద్దు చేయాలని ఎఐటియుసి ధర్నా

**కోడుమూరు, నవబంర్ 10 (ప్రభాతవార్త) :** ఆటో కార్మికులకు శాపంగా మారిన జీవో 21ని తక్షణమే రద్దు చేయాలని కోరుతూ గురువారం స్థానిక తాహశీల్దార్ కార్యాలయం ఎదుట ఎఐటియుసి ఆద్వర్యంలో ధర్నా చేశారు. ఆటో కార్మికుల సమస్యలపై అనేక సార్లు ఉద్యమాలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ఇంత వరకు స్పందించడం లేదని ఆటో కార్మికులు ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఎఐటియుసి నాయకులు విఆర్వో జయరాంకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సిపిఐ, ఎఐటియుసి నాయకులు రాజు, మునుస్వామి, రాముడు, వీరన్న, దాసు, మధు తదితరులు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో కులుమాల తలారి మృతి

**గోనెగండ్ల నవంబరు 10 ప్రభాతవార్త :** మండల పరిధిలోని కులమాల గ్రామానికి చెందిన తలారి బజారి అనారోగ్యంతో మృతి చెందారు. తలారి బజారి మృతి చెందిన విషయం తెలుసుకున్న రెవిన్యూ అధికారులు ఆర్థిక సహాయం కింద తహాశీల్ధార్ వేణుగోపాల్, ఆర్ఐ సునిల్‌కుమార్ రూ.25 వేలు, విఆర్ఏలు రూ.5 వేలు ఆర్థిక సహాయం బజారి భార్య లక్ష్మికి అందజేసి ఆయన కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలియజేశారు. ఈకార్యక్రమంలో వీఆర్వోలు, తలార్లు రంగన్న, రామాంజినేయులు, నబిసాబ్, బడేసాబ్, మోహన్, హనుమంతు, మునిస్వామి తదితరులు పాల్గొన్నారు.

## శాంతిభద్రతల విషయంలో కఠినంగా వ్యవహరించండి



**కోవెలకుంట్ల, నవంబరు 10, ప్రభాతవార్త :** శాంతి భద్రతల విషములో ఎక్కడ రాజీ పడవద్దని జిల్లా యస్‌పి రఘువీర్‌రెడ్డి సూచించారు. గురువారము కోవెలకుంట్ల సర్కిల్ పరిదిలోని సంజామల, కోవెలకుంట్ల, రేవనూరుపోలీసు స్టేషన్‌లను అయన అకస్మికంగా తనికీ చేశారు. ఈసందర్బముగా అయాస్టేషన్‌ల్లో ఉన్న రికార్డులతో పాటు కంప్యూటరు రూంలను పరిశీలించారు. అలాగే స్టేషన పరసరాలను కూడా పరివీలించి వాటిని శుబ్రంగా ఉంచాలని చెప్పారు..ముఖ్యము శాంతి భద్రతల విషయములో ఎక్కడ రాజీ వద్దని చెప్పారు. ఈయన వెంట సిసి.ఫయాజ్ బాష, యస్ఐలు చంద్రశేఖరరెడ్డి తిమ్మారెడ్డి, సిబ్బంది ఉన్నారు.

## అక్రమ నిర్మాణాన్ని పడగొట్టాలని డీపీఓకు వినతి

**కౌతాళం, నవంబర్10, ప్రభాతవార్త ;** మండలకేంద్రమైన కౌతాళంలో బీజాపూర్ మహానంది సన్నాఫ్ తాయప్ప అక్రమంగా రోడ్డును ఆక్రమించి బిల్డింగ్‌ను కట్టడం జరిగిందని, ఈ బిల్డింగ్‌ను కూల్చివేయాలని మారుతి హైకోర్టులో కేసు ఫైల్ చేయడం జరిగిందని, , హైకోర్టు కూడా స్పందిస్తూ అక్రమంగా నిర్మించిన బిల్డింగ్‌ను కూల్చి వేయాలని హైకోర్టు ఆర్డర్స్ పాస్ చేయడం జరిగిందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, హైకోర్టు సీనియర్



అడ్వకేట్ పురుషోత్తంరెడ్డి అన్నారు. ఈ మేరకు గురువారం కర్నూను డీపీఓను కలిసి వినతి పత్రం అందజేశారు. హైకోర్టు ఆర్డర్స్ ఇచ్చి దాదాపుగా ఎనిమిది నెలలు కావొస్తున్నా అధికారులు, ఇన్‌చార్జి ఎంపీడీఓ జగన్‌మోహన్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి నవీన్‌కుమార్, కౌతాళం మేజర్ సర్పంచ్ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఇప్పటికైనా స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు అక్కమ్మతోట రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ కార్మికుల హక్కుల కోసం ఐక్యంగా పోరాడాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా నాయకులు

**నందికొట్కూరు, నవంబర్ 10, ప్రభాతవార్త:** వ్యవసాయ కార్మికుల హక్కుల కోసం ఐక్యంగా పోరాటాలు చేయాలని కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.నాగేశ్వర్‌రావు పిలుపు నిచ్చారు. గురువారం స్తానిక జైకిసాన్ పార్కులో సీనియర్ నాయకులు జెండా విష్కరించి మండల మూడో మహాసభలు నిర్వహించారు. ఈ సంధర్బంగా నాగేశ్వరరావు మాట్లాడుతు గ్రామాలలో వంద మంది రెక్కల కష్టంపైన జీవనం సాగిస్తారని, రాజకీయ పార్టీలు వ్యవసాయ కార్మికులను ఓటు బ్యాంక్‌గా చూస్తు వారి సంక్షేమాన్ని విస్మరిస్తున్నారని ఆయన ఆరోపించారు. ఉపాధి హామీఈ చట్టం ద్వారా కుటుంబానికి రూ.600 లు వేతనం పడేలా రెండు వందల రోజులు పని కల్పించాలన్నారు. అనంతరం 18 మందితో మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో పి.వెంకటేశ్వర్లు, పి.పక్కీర్‌సాహెబ్, వేణుగోపాల్, శ్రీనువాసులు, ఈశ్వరమ్మ, నూర్జాహాన్, ఆంజినేయులు పాల్గొన్నారు.

## బదిలీపై వెళ్లిన సునందకు సన్మానం



హిందీపండిట్‌ను సన్మానం

**పగిడ్యాల, నవంబరు 10, ప్రభాతవార్త :** పగిడ్యాల జెడ్పీపాఠశాలలో హిందీపండిట్‌గా పనిచేస్తూ బదిలీపై వెళ్లిన శ్రీమతి సునందను హెచ్‌ఎం మధుసూనదరావు అధ్వర్యంలో గురువారం ఉపాధ్యాయులు దుశ్శాలు కప్పి పూలమాలువేసి ఘనంగా సన్మానం చేశారు. 10యేళ్ల హిందీపండిట్‌గా పనిచేసి తా ండ్రపాటు జెడ్పీపాఠశాలకు బదిలీపై వెళ్ళారు. అంకితభావంతో పనిచేసే సునంద హిందీపండిట్ అభినందనీయరాలను అమె సేవలను కొనియాడారు. సన్మానం చేసిన వారందరికీ హిందీపండిట్ సునంద కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ సుభాన్, సీనియర్ ఉపాధ్యాయులు రసీద్‌మియ్య, మొదీనాయక్, శ్రీదాశ్రీ పీతాంబరెడ్డి, ఉపాధ్యాయులు, కార్యాలయ సిబ్బంది. విద్యార్థులు పాల్గొన్నారు.

## డాక్టర్ అంబేద్కర్ దేశానికి లబించిన గొప్ప ఆస్తి..

**- బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్**

**- దళితుల అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేసిన మహానుభావుడు - దళితుల చైతన్యానికి చదువే గొప్ప ఆయుధం - ఎస్‌సి కమీషన్ చైర్మన్ మారమాడి విక్టరీ ప్రసాద్**



అంబేద్కర్ విగ్రహాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

**తుగ్గలి, నవంబరు 10, ప్రభాతవార్త :** భారతరత్న, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ దేశానికి లబించిన గొప్ప ఆస్తి అని, బడుగు బలహీన వర్గాల వెనుకబాటు తనాన్ని రూపుమాపేందుకు చదువే శక్తివంతమైన ఆయుదమని ఆంధ్రప్రదేశ్ ఎస్‌సి కమీషన్ చైర్మన్ మారుమూడి విక్టరీ ప్రసాద్ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రమైన తుగ్గలిలో స్థానిక ఎంపీడీవో కార్యాలయము నందు నూతన బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహాన్ని ఎస్‌సి కమీషన్ చైర్మన్ విక్టరీ ప్రసాద్, ఎమ్మార్పీఎస్ఎస్ వ్యవస్థాప అద్యక్షులు బుంగ సంజయ్ మాదిగ, ఏపి ఎమ్మార్పీఎస్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొందిమడుగుల టిఎం రమేష్ మాదిగ, ఏపి ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు సువర్ణ రాజు, మాజీ జడ్పీటీసి వరలక్ష్మి, శాలివాహన ఫెడరేషన్ మాజీ చైర్మన్ తుగ్గలి నాగేంద్ర, గుత్తి ఎంపీడీఓ అమృత రాజ్ చేతుల మీదుగా పూలమాల వేసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్బంగా ఎస్‌సి కమీషన్ చైర్మన్ మారుమూడి విక్టరీ ప్రసాద్ మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ భారతదేశానికి లభించిన గొప్ప ఆస్తి.. మానవతావాది..ప్రపంచ మేధావి..అని కొనియాడారు. బి.ఆర్.అంబేద్కర్ మారుమూల గ్రామీణ ప్రాంతంలో జన్మించి దేశానికి దృఢమైన రాజ్యాంగాన్ని అంది ంచారన్నారు. భారతదేశంలో దళిత చైతన్యానికి ఆయన ఎంతో కృషి చేశారన్నారు. దేశంలోని బడుగు బలహీన వర్గాలకు ఆయన గొంతుగా మారారన్నారు. తద్వారా విద్యార్థులు యువత ఉన్నత చదువులు చదివి ఆ మహానీయుని జీవిత చరిత్రలను తెలుసుకొని ఆయన అడుగుజాడల్లో నడవాలన్నారు. యావత్ భారత ప్రజలకు అంబేద్కర్ ఒక శక్తి అని రాజ్యాంగ రూపకర్త అంటరానితనం రూపుమాపిన సంఘసంస్కర్త అని దళితుల అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేసిన మహానుభావుడు అని కొనియాడారు. అంటరానితనం వివక్షతలపై అలుపెరుగని పోరాటం చేసిన అస్తిత్వ ఉద్యమాలకు దశ దిశలను చూపిన స్పూర్తి ప్రధాత, ఆర్థికవేత్త, న్యాయ కోవిదుదు నీతిజ్ఞుడు, భారత రాజ్యాంగ నిర్మాణంలో కీలక పాత్రదారి డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ అని ఆ మహానీయుని ఆశయ సాధనకై ప్రతి ఒక్కరూ పునరంకితమవ్వాలన్నారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ప్రతిష్ట రాజ్యాంగం వల్లే దేశం సుస్థిరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు తిరుపాల్, రామకొండ వెంకటేష్, ఉద్యోగ సంఘాల జిల్లా అధ్యక్షుడు శ్రీరాములు, ఎమ్మార్పీఎస్ఎస్ జిల్లా నాయకుడు మద్దిలేటితో పాటు ఆయా జిల్లాల అద్యక్షులు, ఆర్డీఓ మోహన్‌దాస్. తుగ్గలి తహాశీల్దార్ రవి, ఎంఈఓ రామ వెంకటేశ్వర్లు, జడ్పీటీసి పులికొండ నాయక్, సర్పంచ్ రామాంజినేయులు, ఎంపిటీసి దేవరాజు, సిపిఐ మండల కార్యదర్శి సుల్తాన్, టిడిపి మండల అద్యక్షుడు తిరుమల నాయుడు, వైద్యాధికారి ప్రవీణ్ కుమార్, రూరల్ సిఐ రామకృష్ణా రెడ్డి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సుధాకర్ రెడ్డి, వీఆర్ఓ నాగేంద్ర, పంచాయితీ సెక్రెటరీ రాజు నాయక్, మరింత మంది దళిత ఉపకులాల నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పెంచిన కూలీలు, అరియర్స్ జీఓ విడుదల చేయాలి



ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

**ఆలూరు, నవంబరు 10, ప్రభాతవార్త :** ఏపి సివిల్ సప్లయ్ హమాలీ సంఘం(సిఐటియు) జిల్లా 6వ మహాసభలు ఆలూరులో అట్టహాసంగా జరిగాయి. గురువారం జిల్లాలోని సివిల్ సప్లయ్ గోడౌన్‌లకు సంబంధించిన 7స్టాక్ పాయింట్ల నుండి హమాలీ కార్మికులు పెద్దఎత్తున సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక జ్యోతిబసు భవన్ నుండి డప్పులు బాణసంచాలతో చెక్‌పోస్టు, మెయిన్ బజార్, అంబేద్కర్ సర్కిల్ మీదుగా సివిల్ సప్లయ్ గోడౌన్ వరకు ర్యాలీగా వెళ్లి సిఐటియు జెండాను హమాలీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆర్ క్రిష్ణ ఆవిష్కరించారు. ఈ మహాసభ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్బంగా సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి ఈరన్న, ఏపి సివిల్ సప్లయ్ హమాలీ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు జె నాగేశ్వరరావు, రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ క్రిష్ణలు మాట్లాడుతూ ప్రభుత్వం జనవరిలో పెంచాల్సిన కొత్త కూలీ రేట్లు పెంచడంలో జాప్యం చేయడంతో 9నెలల పోరాటంతో ప్రభుత్వ అధికారులు సివిల్ సప్లయ్ గోడౌన్ హమాలీలకు కూలీరేట్లు పెంచిందన్నారు. పెంచిన కూలీరేట్లు, అరియర్స్ జీఓను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. హమాలీ కార్మికులు ఐక్యమత్యంతో సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు. ఈ మహాసభలను స్థానిక కార్మికులు జయప్రదం చేసేందుకు కృషి చేసిన అందరికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం జిల్లా నూతన కమిటీలో అధ్యక్షుడుగా ఆర్ క్రిష్ణ, కార్యదర్శిగా బజారితో పాటు 15మందిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు కెపి నారాయణస్వామి, మండల కార్యదర్శి షాకీర్, హమాలీ కార్మికులు పాల్గొనా న్నరు.

## ఆటోరంగ కార్మికులకు శాపంగా మారిన జీఓ 21ని రద్దు చేయాలి



ఆర్ఐకి వినతిపత్రం అందచేస్తున్న ఏఐటియుసి నాయకులు

**దేవనకొండ, నవంబరు 10, ప్రభాతవార్త :** ఆటోరంగ కార్మికులకు శాపంగా మారిన జీఓ 21ని తక్షణమే రద్దు చేయాలని ఏఐటియుసి మండల గౌరవ అధ్యక్షులు ఎం నర్సా రావు, ఆటోవర్కర్స్ యూనియన్ నాయకులు పి రాజన్న, వై రంగయ్యలు డిమాండ్ చేశారు. గురువారం ఏపి ఆటోడ్రవర్స్, మోటార్ వర్కర్స్ యూనియన్(ఏఐటియుసి అనుబంధం) ఆధ్వర్యంలో ఏఐఎస్ఎఫ్ మండల అధ్యక్షులు వై మధుబాబు అధ్యక్షతన రాష్ట్రసమితి పిలుపులో భాగంగా స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు ఆటో కార్మికులతో కలిసి ఆందోళన చేపట్టారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఆర్ఐ విష్ణుప్రసాద్‌కు అందచేశారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఆటో, మోటారు వాహానాలపై పెండింగ్‌లో పోలీసు ఈ చలానాలు రద్దు చేయాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రమాదకరంగా ఉన్న గోతుల రోడ్లను పక్కాగా వేసి ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాలని తెలిపారు. పెంచిన డీజిల్, పెట్రోల్, వంటగ్యాస్, విద్యుత్, ఇంటిపన్ను, చెత్తపన్నులు రద్దుచేసి ఆటో డ్రైవర్ల కుటుంబ సభ్యులకు జీవనోపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. ఆటో, మోటార్ వాహానాలపై పెంచిన గ్రీన్‌ట్యాక్స్, రోడ్డు ట్యాక్స్, టోల్‌ప్లాజా ఫీజులు, సిఎన్‌జి గ్యాస్ ధరలను రద్దుచేయాలన్నారు. డ్రైవర్లు, మెకానిక్‌లకు పిఎఫ్, ఈఎస్ఐ పెన్షన్‌తో కూడిన సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి, ఆటో యూనియన్ మండల నాయకులు విజయ్‌కుమార్, ఉస్మాన్, శ్రీరంగడు, ఆటో శంకర్, నరేష్, బాలాజీ, పాలరవి తదితరులున్నారు.

## టిప్పు సుల్తాన్ 273వ జయంతి వేడుకలు



మాట్లాడుతున్న వక్తలు

**వెలుగోడు, నవంబర్ 10, ప్రభాతవార్త:** మొట్టమొదటి స్వాతంత్ర సమరయోదుడు టిప్పుసుల్తాన్ 273వ జయంతి వేడుకలను ఆవాజ్ కమిటీఈ ఆధ్వర్యలో ఘనంగా నిర్వహించారు. గురువారం సిపి నగర్ యం.పి.పి.ఉర్దు పాఠశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతు టిప్పుసుల్తాన్ లౌకిక వాదిగ, మేధావిగా పండితుడిగా మొట్టమొదటి క్షిపణి పితామహుడు ప్రపంచ ఖ్యాతిని పొందాడన్నారు. కావున మనం ఆన ఆదర్శంగా తీసుకొని ఐక్యంగా దేశాభివృద్ధి కొరకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని వారు కోరారు. విద్యార్థులు మంచి క్రమశిక్షణతో బాగా చదివి దేశానికి మంచి పేరు తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో మేజర్ గ్రామ సర్పంచ్ వేల్పుల జయపాల్, అవాజ్ కమిటీ జిల్లా అధ్యక్షులు మొహమ్మద్‌రఫీ, అవాజ్ మండల కార్యదర్శి నూరుల్లా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## దేవనకొండ ఎంపిడిఓగా గౌరీదేవి



ఎంపిడిఓ గౌరీదేవి

**దేవనకొండ, నవంబరు 10, ప్రభాతవార్త :** దేవనకొండ మండల ఎంపిడిఓగా గౌరీదేవి గురువారం పదవీ భాధ్యతలు స్వీకరించారు. రెగ్యులర్ ఎంపిడిఓ లేకపోవడంతో ఇంచార్జ్ ఎంపిడిఓగా ఇద్రుష్‌భాష విధులు కొనసాగించాడు. అయితే రెగ్యులర్ ఎంపిడిఓగా గౌరీదేవి రావడం జరిగింది. ఈ సందర్బంగా ప్రభాతవార్తతో నూతన ఎంపిడిఓ గౌరీదేవి మాట్లాడుతూ గతంలో పగిడ్యాల మండల ఎంపిడిఓగా పనిచేయడం జరిగిందన్నారు. గత జూన్ నెలలో జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా చిత్తూరు జిల్లాకు బదిలీ చేయడంతో దీర్ఘకాలిక సెలవు పెట్టడం జరిగిందని ఉన్నతాధికారుల ఉత్తర్వుల మేరకు దేవనకొండ ఎంపిడిఓగా భాద్యతలు చేపట్టడం జరిగిందని తెలిపారు.

## ఇంజనీరింగ్ అసిస్టెంట్‌ను సస్పెండ్ చేయాలి

**పత్తికొండ, నవంబర్10, ప్రభాతవార్త:** పత్తికొండ పట్టణంలో 5వ సచివాలయంలో పనిచేస్తున్న ఇంజనీరింగ్ అసిస్టెంట్‌ను సస్పెండ్ చేయాలని సీఐటీయు మండల అధ్యక్షులు కాశీవిశ్వనాథ్ డిమాండ్ చేశారు. జగనన్న లేఔట్ కాలనీలో లబ్దిదారులకు ఇల్లు కట్టుకోవడానికి అన్ని అర్హతలు ఉన్నా ఇంజనీరింగ్ అసిస్టెంట్ మ్యాపింగ్ చేయకుండా లబ్దిదారులను ఇబ్బందులకు గురిచేస్తున్నరన్నారు. అదే సచివాలయంలో మ్యాపింగ్ చేయనని వేరే సచివాలయంలో చేయించుకోవాలని ఈ సచివాలయంలో మాత్రం లబ్దిదారులకు మ్యాపింగ్ చేయనని చెబుతున్నారని హౌసింగ్ అధికారులనే మీరు వారికి ఇల్లు ఎందుకు మంజూరు చేశారని సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ ప్రశ్నించినట్లు సమాచారం. ఇల్లు నిర్మాణం చేపట్టిన లబ్దిదారురాలు అయిన మహిళ బిల్లు కోసం మ్యాపింగ్ చేయాలని సదరు అధికారిని అడిగితే నేను చేయనని నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున న్నరన్నారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా పేదలకు జగనన్న కాలనీలో ఇల్లు కట్టుకునేందుకు ప్రోత్సహిస్తున్నా ఇటువంటి అధికారుల పనితీరు వల్ల ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని పలువురు విమర్శిస్తున్నారు. దీని పై జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని సీఐటీయు నాయకులు కోరుతున్నారు. లేని పక్షంలో సీఐటీయు ఆధ్వర్యంలో ధర్నా చేపడతామని వారు హెచ్చరించారు.

## రాష్ట్రపతి ద్రౌపది ముర్మూ దృష్టికి వాల్మీకి బోయల సమస్య



రాష్ట్రపతి ద్రౌపది ముర్మూకి జ్ఞాపికను అందచేస్తున్న ఏపివిబిఎస్ నాయకులు

**హొళగుంద, నవంబరు 10, ప్రభాతవార్త :** భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్మూ దృష్టికి ఆంధ్రప్రదేశ్ వాల్మీకి బోయల సమస్యను తీసుకెళ్లినట్లు ఏపి వాల్మీకి బోయ సంఘం(ఏపివిబిఎస్) గౌరవ అధ్యక్షులు హనుమంతునాయుడు, భ్రమరాంబ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోయ క్రాంతినాయుడు, కర్నూలు జిల్లా అధ్యక్షులు వాల్మీకి అర్జున్, కుప్పం వాల్మీకి నాయకులు బాబునాయుడు, ఎల్లార్తి మహేష్‌లు తెలిపారు. ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో ఏపివిబిఎస్ నాయకులు రాష్ట్రపతి ద్రౌపది ముర్మూను కలవడం జరిగింది. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ 70ఏళ్ల స్వాతంత్ర్య భారత దేశంలో వాల్మీకి బోయలు ఎదుర్కొంటున్న సమస్యలు ఎస్‌టి హోదా కోసం చేస్తున్న పోరాటాలు, 3వేల కి.మీలకు పైగా వాల్మీకి మేలుకొలుపు యాత్రలో తెలుసుకున్న విషయాలు, వలసలు, బోయల దుర్బర పరిస్థితులు, జైళ్లపాటు, బోయలపై ఉన్న కేసులు, రౌడీషీటర్ పేరుతో అరాచకాలు, బోయవాడల దయనీయ దుస్థితులు, సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఎలా వెనుకబడ్డారు, ఒక్క అభివృద్ది పథకం కూడ లేకపోవడం, వృత్తిలేని కారణంగా లోన్‌లు ఇవ్వకుండ బ్యాంకులు ఏ విధంగా తిరస్కరిస్తున్నారు, చదువులో ఎలా వెనుకబడ్డారు, ఒక్క స్టడీ సెంటర్ లేని దయనీయ స్థితి, నిరుద్యోగ, రైతు, కార్మికుల సమస్యలు, ప్రాంతీయ వ్యత్యాసాలు, స్పెషల్ ఏజెన్సీ అంశాలు, కేంద్రప్రభుత్వం చూపుతున్న మొండివైఖరి, ఆర్‌జిఐ ఇచ్చిన ఆధారాలు లేని రిపోర్టు వాటికి సమాధానాలు, కేంద్రమంత్రిత్వ శాఖలు మేము ఫైల్ చేసిన ఆర్టీఐలకు సమాధానాలు లేక మా దగ్గర మీ డేటా లేదు అన్న అంశాలు, వారిచ్చిన అఫిడవిట్‌లు, దేశంలో వాల్మీకులు ఎలా ఉన్నారు, పక్క రాష్ట్రం కర్ణాటకలో ఎస్‌టిలో, మన రాష్ట్రంలో ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న అంశాలు, ఎరుకలు, లంబాడీలను చేర్చి బోయలను ఎలా ఎస్‌టి నుండి తొలగించారు, రాజ్యాంగ ఉల్లంఘనలు జరిగిన సంఘటనలు, 1976లో జరిగిన రాజ్యాంగ ఉల్లంఘన విషయం, ప్రధాని మోడీ కర్నూలు సభలో ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట, ప్రస్తుత రాష్ట్ర సిఎం వైఎస్ జగన్ ఇచ్చిన మాట, పోయిన ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన కమీషన్లు వారి రిపోర్టుల గురించి, రాష్ట్ర ప్రభుత్వం పంపిన బిల్లు గురించి ఇలా దాదాపు 30ని॥లు జరిగిన సమావేశంలో అన్ని క్లుప్తంగా వివరించి ఒక సుదీర్ఘ రిపోర్టును రాష్ట్రపతికి అందచేయడం జరిగిందన్నారు. దేశంలో రాజ్యాంగ పరిరక్షకులు అయిన మీరు రాజ్యాంగ ఉల్లంఘన జరిగిన అంశాలు మీ దృష్టికి తీసుకొస్తున్నామని సవరణ చేసి పరిష్కరించాలని కోరినట్లు తెలిపారు. అన్నింటికీ సానుకూలంగా స్పందించిన రాష్ట్రపతి త్వరలో ఈ అంశంపై తప్పక కార్యచరణ చేపడతామని ప్రధాని, హోంమంత్రి, కేంద్ర ట్రైబల్ వెల్ఫేర్ మినిస్టర్, సోషల్ జస్టిస్ మినిస్ట్రీతో చర్చించి మీకు న్యాయం చేస్తాను నాకు సమయం ఇవ్వండి అని చెప్పారన్నారు.

## కెఇ కుటుంబం గురించి మాట్లాడడం సమంజసం కాదు



మాట్లాడుతున్న మండల తెదేపా నాయకులు

**వెల్దుర్తి, నవంబర్10, ప్రభాతవార్త :** కెఇ కుటుంబం గురించి వైకాపా రాష్ట్ర నాయకులు మాట్లాడడం సమంజసం కాదని దీన్ని మండల తెదేపా తీవ్రంగా ఖండిస్తుందని మండల తెదేపా అధ్యక్షులు టి.ఇ.బలరాంగౌడ్ అన్నారు. స్థానిక తెదేపా కార్యాలయంలో గురవారం బొమ్మన శివశంకర్‌రెడ్డి స్వగృహంలో మండల తెదేపా అధ్యక్షులు బలరాంగౌడ్ అధ్యక్షతన తెదేపా నాయకులతో కలిసి విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్బంగా తెదేపా అధ్యక్షులు, నాయకులు చెర్లకొత్తూరుపుల్లయ్య, ఎస్సీ సెల్ జిల్లా నాయకులు వీరభద్రుడు, మండల తెలుగు యువత అధ్యక్షులు సుధాకర్‌గౌడ్, బోగోలు సర్పంచ్ అమర్‌నాథ్‌గౌడ్, రామచంద్రనాయుడు, మాజీ జడ్పీటిసి ఐజయ్య, ఎర్రబజారు మాట్లాడుతూ రాష్ట్ర వైకాపా నాయకులు సొసైటీ కార్యాలయంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో కెఇ కుటుంబంపై వ్యక్తిగత దూషణలు చేయడం సరైంది కాదన్నారు. వెల్దుర్తి మండలంలో ఇసుక, మట్టి, ఐరన్ మాఫియాతో కోట్లు దండుకుంది మీరు కాదా అన్నారు. తెదేపా ప్రభుత వ్ంలో డిప్యూటీ సిఎం కెఇ క్రిష్ణమూర్తి పత్తికొండ నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో కోట్ల రుపాయల నిధులతో అభివృద్ధి పనులు చేశారన్నారు. వెల్దుర్తి మండలంలో తమ ప్రభుత వ్ం హాయంలో 12 రోడ్లకు టెండర్లు వేయించి పనులు చేయించడం జరిగిందన్నారు. మేము ప్రారంభించిన రోడ్లను మీరు పూర్తి చేసి మేము చేశామని చెప్పుకోవడం హాస్యస్పదం అన్నారు. ఈ మండలంలో హత్యలు చేయించింది, బిసి నాయకుడైన క్రిష్ణగిరి సొసైటీ సిఇఓ సోమన్నను కిడ్నాప్ చేయించింది, కప్పట్రాళ్ల వెంకటప్పనాయుడు హత్య కేసులో ముద్దాయిలు మీ కుటుంబం వారు కాదా అని ప్రశ్నించారు. మీరెంటో మండల ప్రజలందరికి తెలుసన్నారు. నాడు తెదేపా ప్రభుత్వంలో పత్తికొండ నియోజకవర్గంలోని 68 చెరువులకు నీళ్ల మల్లించి నింపేందుకు అప్పటి డిప్యూటీ సిఎం కెఇ క్రిష్ణమూర్తి కోట్ల రుపాయల నిధులు విడుదల చేయించి 70 శాతం పనులు పూర్తిచేస్తే మీ ప్రభుత్వంలో ఇప్పటికి పూర్తి చేయలేకపోయారన్నారు. శుద్ధజలం ప్లాంట్లను లక్షలాది రుపాయలతో నాడు ఏర్పాటు చేయిస్తే నేడు మీరు ప్రారంభించి అవి పనిచేయకుండా మూతపడేలా చేశారన్నారు. మండలంలోని 11 గ్రామాల్లో మీ వాళ్ల భూ కబ్జాలు చేశారన్నారు. మా నాయకుడు పత్తికొండ తెదేపా ఇంచార్జ్ కెఇ శ్యాంబాబు త్వరలోనే వెల్దుర్తి మండలంలోని అన్ని గ్రామాల్లో పాదయాత్ర చేయనున్నారన్నారు. ఆ పాదయాత్రలో అన్ని ఆధారాలతో ప్రజల ముందు బయటపెడతామన్నారు. మీరు చేసిన వ్యాఖ్యలు ఫ్యాక్షన్‌ను పోత్సహించేలా ఉన్నాయన్నారు. మా నాయకులు ఫ్యాక్షన్‌ను అణచివేసేందుకు కెఇ క్రిష్ణమూర్తి అహర్నిశలు కృషి చేశారన్నారు. మా ప్రభుత్వంలో చెరువులో పూడికతీత మట్టిని రైతులకు ఉచితంగా ఇచ్చామని నేడు ట్రక్టర్‌కు రూ.100 లాగా అమ్ముకుంటున్నారన్నది నిజం కాదా అన్నారు. ఈ కార్యక్రమంలో మండల తెదేపా నాయకులు చెర్లకొత్తూరు పుల్లయ్య, మాజీ సర్పంచ్ సూదేపల్లి జయరాముడు, గుంటుపల్లి ఈదుల వెంకటరాముడు, సుధాకర్‌గౌడ్, బోగోలు సర్పంచ్ అమర్‌నాథ్‌గౌడ్, రామచంద్రనాయుడు, మాజీ జడ్పీటిసి ఐజయ్య, ఎర్రబజారు, చిన్నగోపాల్‌గౌడ్, రామళ్లకోట శశి, మోశ, రాఘవేంద్రగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఫ్యాగింగ్ మిషన్‌పై డిమోను పరిశీలించిన అధికారులు



**పగిడ్యాల, నవంబరు 10, ప్రభాతవార్త :** పగిడ్యాల ఎంపిడిఓ కార్యాలయం అవరణంలో దోమల నివారణకు ఫ్యాగింగ్ మిషన్ డెమోను గురువారం సాయంత్రం ఎంపిడిఓ బివి.రమణ, ఇఓఆర్‌డి పుల్లయ్య పరిశీలించారు. దోమల వ్యాప్తిని అరికెట్టందుకు ఫ్యాగింగ్ మిషన్ కంపెనీకిసంబంధించిన ప్రతినిధి ప్రవీణ్‌డెమో డెమో నిర్వహించారు. ఈ కార్యమ్రంలో పిఎస్‌లు ఉపేంద్రారెడ్డి, సమతాయశోధర తోపాటు వివిధగ్రామాలను చెందిన పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## కోడుమూరు నియోజకవర్గంలో రోడ్ల మరమ్మతుల చేపట్టండి



జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న కోడుమూరు నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జ్ మీసాల ప్రేమ్ కుమార్

**కర్నూలురూరల్, నవంబర్10, ప్రభాతవార్త:** కలెక్టర్ కార్యాలయం నందు కోడుమూరు నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జ్ మీసాల ప్రేమ్ కుమార్ గురువారం జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావును కలిసి కోడుమూరు నియోజకవర్గంలో రోడ్ల మరమ్మతులు చేపట్టాలని వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో కర్నూలు మండల బీజేపీ ప్రధాన కార్యదర్శి సద్దుల మధు, కిశోర్, ఓబీసీ మోర్చ మండల ప్రధాన కార్యదర్శి పిక్కిలి ఎమల్లేష్, ఓబీసీ మోర్చ జిల్లా కార్యదర్శి మస్తాన్ బీలు పాల్గొన్నారు.

## సంక్షేమ వసతి గృహాల పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి



డిప్యూటి తహాసిల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

**నందికొట్కూరు, నవంబర్ 10, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని సాంఘీక సంక్షేమ వసతి గృహాలలో పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం రెవెన్యూ కార్యాలయం వద్ద ధర్నా చేసి డిప్యూటి తహాసిల్దార్ పద్మావతికి వినతి పత్రం అందజేశారు. ఈ సంధర్బంగా జిల్లా కార్యదర్శి మహానంది మాట్లాడుతు వసతి గృహాలలో 2018 మెను ప్రకారం కాకుండా 2022 మెను ప్రకారం పెరిగిన ధరలకు అనుగుణంగా విద్యార్థులకు మెస్, కాస్మోటిక్స్ చార్జీలను పెంచాలని అలాగే పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని, అలాగే వసతి గృహాలలో ఖాళీగా ఉన్న కుక్, కమాటి వాచ్‌మెన్ వార్డెన్ల పోష్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో విద్యార్థులతో కలిసి పెద్ద ఎత్తున ఆంధోళన కార్యక్ర మాలు చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దినేష్, వినోద్‌కుమార్, నాగేంద్ర పాల్గొన్నారు.

## అంగన్‌వాడి కేంద్రానికి భూమిపూజ



భూమిపూజలో పాల్గొన్న సిడిపిఓ సావిత్రమ్మ

**మద్దికెర, నవంబరు 10, ప్రభాతవార్త :** మండల పరిధిలోని బురుజుల గ్రామంలో కొత్త అంగన్వాడి కేంద్రం నిర్మాణానికి గురువారం సిడిపిఓ సావిత్రమ్మ చేతుల మీదుగా భూమి పూజ జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రం ద్వారా గ్రామంలో ఉన్న చిన్నారులు, గర్భవతులు, బాలింతలకు మంచి పౌష్టికాహారం అందించడం జరుగుతుందన్నారు. దీని వల్ల గర్భవతులు, పిల్లలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. అంగన్‌వాడి కేంద్రాలు గ్రామానికి ఎంతో మేలు చేస్తుందన్నారు. మద్దికేర మండలానికి 2 అంగన్ వాడి కేంద్రాలు మంజూరయ్యాయని మద్దికెరలో ఇప్పటికే పనులు మొదలయ్యాయని బురుజుల గ్రామంలో కూడా త్వరగా పనులు చేయించి త్వరలోనే అంగన్‌వాడి కేంద్రాన్ని ప్రారంభిస్తామన్నారు. ఇందుకు సహకరించిన గ్రామ సర్పంచ్, గ్రామ ప్రజలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఈ భూమి పూజ కార్యక్రమానికి సూపర్‌వైజర్ విజయలక్ష్మి, అంగన్‌వాడి టీచర్లు మనెమ్మ, వెంకటమ్మ, ఆయాలు నరసమ్మ, చెన్నమ్మ, పంచాయితీ సెక్రెటరి, హరికృష్ణ, సర్పంచ్ పద్మావతమ్మ ఇంజనీర్ అసిస్టెంట్ శారద, మహిళా పోలీస్ రమాదేవి, జై భారత రెడ్డి, సుబ్బయ్య, బురుజుల రాముడు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## 14న జాతీ గ్రంధాలయ వారోత్సవాలు

**నందికొట్కూరు, నవంబర్ 10, ప్రభాతవార్త:** ఈ నెల 14 నుండి20 వరకు స్తానిక గ్రంధాలయంలో 55వ జాతీయ గ్రంధాలయ వారోత్సవాలు నిర్వహించడం జరుగుతుందని గ్రంధాలయ నిర్వాహకులు మురళీధర్ ఓ ప్రకటనలో తెలిపారు. 14న గ్రంధాలయ వారోత్సవాల ప్రారంభ వేడుకలు, బాలల దినోత్సవం, 15న పుస్తక ప్రదర్శన ఏర్పాటు మాదక ద్రవ్యాలపై అవగాహన, పుస్తక పఠన ప్రాముఖ్యత, 16న గ్రంధాలయ ఉద్యమంలో పాల్గొన్న ప్రముఖులు కీ.శే. గాడిచెర్ల హరిసర్వోత్తమరావు, కీ.శే.అయ్యంకి వెంకటరమణయ్య, కీ.శే.డా.యస్.ఆర్.రంగనాథన్, కీ.శే.పాతూరి నాగభూషణం వారిని స్మరించుకోవడం, 17న కవి సమ్మేళనాలు, సెమినార్లు, రచయితల సందేశాలు, 18న పాఠశాల విద్యార్థినీ విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ మరియు క్రీడల పోటీలు, 19న దిశ చట్టం మరియు మహిళా సాధికారికతపై చర్చ, 20న డిజిటల్ గ్రంధాలయాలపై విద్యర్థులకు అవగాహన, సామూహిక స్వీయపఠనము, జాతీయ గ్రంధాలయ వారోత్సవ ముగింపు వేడుకలు జరుపబడుతాయని కావున గ్రంధాలయ శ్రేయోభిలాసులు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని తెలిపారు.

## నూతన తహాశీల్దార్‌ని కలిసిన పలువురు



తహాశీల్దార్ నాగరాజుతో జడ్‌పిటిసి తదితరులు

**మద్దికెర, నవంబర్ 10, ప్రభాతవార్త :** మద్దికేర మండల కేంద్రంలోని నూతన తాహాశీల్దార్‌గా భాద్యతలు చేపట్లినటువంటి నాగరాజును పలువురు ప్రముఖులు కలిసి అభినందనలు తెలపడం జరిగింది. జడ్‌పిటిసి మురళీధర్‌రెడ్డి, ఇరిగేషన్ డైరెక్టర్ రేలంపాడు వెంకటేశ్వర్లు, రాష్ట్ర యాదవుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులు యాదవ్, తాలుక యాదవుల సంఘం కన్వీనర్ పాపిరాజు, మండల యాదవుల సంఘం అధ్యక్షుడు గోపాల్, ఉపాధ్యక్షులు డిఎస్, విద్యాసాయి విద్యాసంస్థల కన్వీనర్ మాధవ్ యాదవ్, ఎంపిటిసి గద్దల అంజి, వార్డుమెంబర్ కవిరెడ్డి కృష్ణ, మండల రెవెన్యూ సిబ్బంది ప్రత్యేకంగా కలిసి అభినందనలు తెలిపారు.

## ఎస్‌సి కమీషన్ చైర్మన్‌ను కలిసిన జడ్‌పిటిసి పులికొండ నాయక్



మారుమూడి విక్టరీ ప్రసాద్‌తో పులికొండ నాయక్

**తుగ్గలి, నవంబరు 10, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన తుగ్గలిలో ఎంపిడిఓ కార్యాలయం నందు నూతన అంబేద్కర్ విగ్రహావిష్కరణకు విచ్చేసిన ఎస్‌సి కమీషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్‌ను పత్తికొండ ఆర్అండ్‌బి గెస్ట్‌హౌస్ నందు తుగ్గలి జడ్‌పిటిసి పులికొండ నాయక్ పుష్పగుచ్చం అందచేసి ఆయనను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. అనంతరం ఆయన దృష్టికి పలు విషయా లను తీసుకెళ్లినట్లు పులికొండ నాయక్ తెలిపారు. ఇందులో బాట తాండా సర్పంచ్ గౌరవ సలహాదారుడు రామనాయక్, అశోక్ నాయక్‌లు వున్నారు.

## ఉపాధిహామీ పథకం పనుల పై సామాజిక తనిఖీ

**కర్నూలురూరల్, నవంబర్10, ప్రభాతవార్త:** కరూ ్నలు మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో పీడీ అమర్‌నాథ్‌రెడ్డి, ఏపీడీ సలీమ్‌బాషా, పంచాయతీరాజ్ ఇంజనీర్ రవి మోమన్‌రెడ్డి, ఎస్సార్పీసీ వెంకటేశ్వర్లు అధ్యక్షతన కర్నూలు మండలంలోని 23 గ్రామాలకు సంబంధించిన ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనుల పై గురువారం సామాజిక తనిఖీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈవోఆర్డీ నాగేశ్వరరెడ్డి, ఏపీవో బాషా, కర్నూలు మండల టీటీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, హార్టికల్చర్‌శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## కుల, మత, పార్టీలకు అతీతంగా అర్హులందరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తున్నాం - ఎమ్మెల్యే శ్రీదేవి

**పత్తికొండ, నవంబర్10, ప్రభాతవార్త:** కుల, మత, పార్టీలకు అతీతంగా అర్హులందరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందిస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమని పత్తికొండ నియోజకవర్గ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. గురువారం పత్తికొండ మండలంలోని జూటూరు గ్రామ సచివాలయ పరిధిలో మండిగిరి, అగ్రహారంలలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే శ్రీదేవి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. అలాగే అర్హులై ఉండి సంక్షేమ పథకాలు అందని లబ్దిదారులు సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సచివాలయ అధికారులు వాటిని వెంటనే పరిష్కరించాలని ఆమె సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు పాదర్శకంగా అందించేందుకు జగనన్న సచివాలయ, వలంటరీ వ్యవస్థను తీసుకువచ్చారని ఆమె పేర్కొన్నారు. కరోనా సమయంలో కూడా ప్రతి లబ్దిదారుడికి ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందించిందని ఆమె గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి నారాయణదాస్, సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి, జయచంద్రారెడ్డి, మధుసుదన్, వైసీపీ జిల్లా నాయకులు శ్రీరంగడు, కారం నాగరాజు, మోహన్ కృష్ణ, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, అధికారులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# శాస్త్రవేత్తలు కండి... దేశంలో చిరస్థాయిలో నిలవండి : ఎమ్మెల్యే



- కిడ్డీస్ పాఠశాలలో అటల్ టింకరింగ్ ల్యాబ్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి - అలరించిన విద్యార్థులు ప్రాజెక్టుల ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు



ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న దృశ్యం, ప్రదర్శనలో ఉంచిన వివిధ ప్రాజెక్టుల నమూనాలు, నృత్యం చేస్తున్న విద్యార్థులు

**ఆదోనిటౌన్, నవంబర్10, ప్రభాతవార్త ;** దేశాభివృద్ధి కోసం ప్రతి విద్యార్థి శాస్త్రవేత్తలు అవ్వాలని, ఏదో ఒక ప్రాజెక్టు కనుక్కొని పేరు, ప్రఖ్యాతలు సంపాదించి దేశంలోనే చిరస్థాయిగా నిలవాలని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి సూచించారు. గురువారం స్థానిక కిడ్డీస్ పాఠశాలలో అటల్ టింకరింగ్ ల్యాబ్ ప్రారంభోత్సవం జరిగింది. పాఠశాల డైరెక్టర్లు కేశవనారాయణరెడ్డి, చెన్నపురెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి, డిప్యూటీ ఈఈ సుకుమార్ పాల్గొని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అదేవిధంగా విద్యార్థులు ఏర్పాటు చేసిన సైన్స్‌ఫెయిర్ కార్యక్రమాన్ని వారు వీక్షించారు. గ్యాస్ లీకేజీ అయితే ప్రమాదం జరగకుండా అలారం ఏర్పాటు, స్మార్ట్ ఇరిగేషన్, ప్రమాదాలు జరగకుండా రహదారుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థులు వారికి వివరించారు. అనంతరం కార్యక్రమంలో ఎమ్మెల్యే జ్యోతి ప్రజ్వలన చేసి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు అటల్ టింకరింగ్ ల్యాబ్ ఉపయోగ పడుతుందన్నారు. ఎంతోమంది శాస్త్రవేత్తలు ఎన్నో కనుక్కొని ఇప్పటివరకు వారి పేర్లతో సంబరాలు జరుపుకుంటున్నామని తెలిపారు. ప్రస్తుత పోటీ రంగంలో ప్రతి విద్యార్థి లక్ష్యంగా పెట్టుకొని చదవాలని సూచించారు. కిడ్డీస్ పాఠశాల ఆదోని పట్టణంలో మంచి పేరున్న పాఠశాల అని, బాధ్యత, పట్టుదలతో యాజమాన్యం విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారని కొనియాడారు. పేద విద్యార్థులు బాగా చదవాలని, వారు ఉన్నత స్థాయికి ఎదగాలన్న ఉద్దేశ్యంతో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఫీజు రీయింబర్స్‌మెంట్ చేశారన్నారు. డాక్టర్‌గా ఉంటూ పేద ప్రజల ఆర్థిక స్థోమతను తెలుసుకుని ఆరోగ్యశ్రీ పథకం పెట్టి ప్రాణదాత అయ్యారని కొనియాడారు. ఆయన బాటలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యార్థుల చదువు తల్లిదండ్రులకు భారంగా ఉండకూడదని అమ్మ ఒడి, విద్యాదీవెన, వసతి తదితర పథకాలను ప్రవేశపెట్టారని చెప్పారు. జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం లక్ష్యంతో, బాధ్యతతో చేపట్టారని తెలియజేశారు. అనంతరం ఆ పాఠశాలలో విద్యార్థులు నృత్యంతో అలరించారు. నృత్యంలో బాగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఎమ్మెల్యే బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ శివరాములు, మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ తిమ్మప్ప, నాయకులు చంద్రకాంత్‌రెడ్డి, వెంకటేష్‌రెడ్డి, పాఠశాల డైరెక్టర్లు కేశవనారాయణరెడ్డి, చెన్నపురెడ్డి, సిబ్బంది, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను కలిసిన పోలూరు సోదరులు



**బేతంచెర్ల, నవంబర్10, ప్రభాతవార్త:** పట్టణానికి చెందిన నంద్యాల పార్లమెంట్ టీడీపీ ఉపాధ్యక్షులు పోలూరు వెంకటేశ్వరరెడ్డి ఆయన సోదరులు, కుమారులు గురువారం ఉండవల్లిలోని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా నారా లోకేష్ డోన్ నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీని అత్యధిక మెజార్టీ సాధించేలా కృషి చేయాలని సూచించినట్లు తెలిపారు. ఎన్నో ఏళ్లుగా స్వర్గీయ నందమూరి తారక రామారావు ఉన్నప్పటి నుండి పోలూరు సోదరులకు అత్యంత సన్నిహిత సంబంధాలు ఉండడంతో నేటికి వారికి పార్టీలో అధిక ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుంది. ఈ మేరకు పార్టీని బలోపేతం చేసేందుకు శక్తివంచనలేకుండా పనిచేయాలని నారా లోకేష్ సూచించినట్లు వారు తెలిపారు. వెంకటేశ్వరరెడ్డితోపాటు సోదరులు పోలూరు రాఘవరెడ్డి, శ్రీనివాసుల రెడ్డి, వారి కుమారులు హరినాథ్‌చౌదరి, రాంప్రకాష్ చౌదరి, రామ్‌కిశోర్ చౌదరి, శ్రీకాంత్ చౌదరి, చైతన్య చౌదరి, మానస్ చౌదరిలు ఉన్నారు.

## న్యాయవిజ్ఞాన సదస్సులో.. చట్టాలపై అవగాహన కల్పించిన డోన్ సబ్‌కోర్టు జడ్జి



**బేతంచెర్ల, నవంబర్10, ప్రభాతవార్త:** పట్టణంలోని హనుమాన్‌నగర్ కాలనీలో గురువారం జరిగిన న్యాయవిజ్ఞాన సదస్సులో డోన్ సబ్ కోర్టు జడ్జి తంగమణి పలు చట్టాల పై అవగాహన కల్పించారు. మహిళల వేధింపులతో పాటు పురుషులను వేధించడం పై కూడా చట్టాలు వచ్చాయన్న విషయాన్ని గుర్తించాలన్నారు. తల్లిదండ్రులను, అత్తమామలను సమాన దృష్టిలో చూసుకోవాలని లేనియెడల న్యాయపరమైన చర్యలు తీసుకునేందుకు చట్టాలు ఉన్నాయన్న విషయాన్ని తెలుసుకోవాలని ఆమె సూచించారు. ప్రామిసరీ నోట్లు, భూవివాదాలు తదితర అంశాల పట్ల చట్టాల్లో ఉన్న శిక్షలు, జరిమానాలు గురించి వివరించారు. వరకట్న చట్టం, బాల్యవివాహాల చట్టాల గురించి జడ్జి వివరించారు. అన్ని చట్టాల పట్ల అవగాహన కలిగి సత్ప్రవర్తనతో ప్రతిఒక్కరు మెలగాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో న్యాయవిజ్ఞాన సదస్సు సిబ్బంది సరిత, ఏఎస్ఐ లింగమయ్య, కాలనీవాసులు పాల్గొన్నారు.

## శ్రీమఠానికి రూ.2 లక్షలు విరాళం

**మంత్రాలయం, నవంబర్ 10, ప్రభాతవార్త:** ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మంత్రాలయం శ్రీ రాఘవేంద్రస్వామి మఠానికి ఓ భక్తుడు రూ.2 లక్షలు విరాళం ఇచ్చినట్లు శ్రీమఠం మేనేజర్ ఎస్‌కె శ్రీనివాసరావు గురువారం విలేకరులకు తెలపారు. వివరాల మేరకు బెంగళూరు పట్టణానికి చెందిన కౌశల్ కావలే అనే భక్తుడు భక్తులకు ప్రతినిత్యం అందించే ఉచిత అన్నదాన సేవకు వినియోగించాలని ఈ విరాళం అందించినట్లు వెల్లడించారు.

## బనగానపల్లె నియోజకవర్గ టీడీపీ మైనార్టీసెల్ అధ్యక్షులుగా రాయలసీమ సలాం



మాజీ ఎమ్మెల్యే బీసీతో సలాం

**బనగానపల్లెరూరల్, నవంబర్10, ప్రభాతవార్త:** తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు ఆదేశాల మేరకు బనగానపల్లె నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ముస్లిం మైనార్టీ సెల్ కమిటీ సభ్యుల నియామక కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా నంద్యాల జిల్లా పరిధిలోని బనగానపల్లె నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ మైనార్టీసెల్ అధ్యక్షులుగా కె.అబ్దుల్ సలాం(రాయలసీమ సలాం)ను, ఉపాధ్యక్షులుగా బాయకాటి హుస్సేన్, పసుపల మహమ్మద్, జమాల్, ప్రధాన కార్యదర్శిగా ఓ.హుస్సేన్‌బాషా, అధికార ప్రతినిధులుగా హుస్సేన్ వలి, కె.కుళాయి బాషా, కార్యనిర్వాహక కార్యదర్శులుగా నబీరసూల్, ఫకూర్ బాషా, ఎం.హాజీ బాషా, బి.హాజీ బాషా, ఎం.రసూల్, కార్య దర్శులుగా ఖైరత్ ఆలీ, గాజుల అన్వర్, షేక్ మహబూబ్ బాషా, ఎం.యుసఫ్‌బేగ్, షేక్ అన్వర్ బాషా, సోషల్ మీడియా కో ఆర్డినేటర్ ఎస్.ఖాజా హుస్సేన్‌లను ఎన్నుకున్నారు. ఈ మేరకు ఎన్నికైన సభ్యులు తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి, టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడికి, బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్‌రెడ్డిలకు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బనగానపల్లె నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ బలోపేతానికి తమ వంతు కృషి చేస్తామని వారు తెలియజేశారు.

## మద్యం కుంభకోణంలో వైసిపి ఎంపి విజయసాయిరెడ్డి పాత్ర

- టిడిపి మాజీ ఇంచార్జ్ గుడిసె కృష్ణమ్మ



గుడిసె కృష్ణమ్మ

**ఆదోని, నవంబరు 10, ప్రభాతవార్త :** మద్యం కుంభకోణంలో వైసిపి ఎంపి విజయసాయిరెడ్డి పాత్ర బయటపడిందని టిడిపి మాజీ ఇంచార్జ్ గుడిసె కృష్ణమ్మ అన్నారు. గురువారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ ప్రధాని పర్యటన ఏర్పాట్లు చూస్తున్న విజయసాయి రేపు మోడీకి శరత్ చంద్రారెడ్డి అరెస్టుపై ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. ఓదార్పు యాత్రలో మహిళలకు జగన్‌మోహన్‌రెడ్డి మద్యపాన నిషేదం అంచలంచెలుగా నిషేధిస్తామని రాష్ట్ర మహిళలకు ఎన్నికల ముందు హామీ ఇచ్చారన్నారు. కానీ సిఎం జగన్ అంచల ంచెలుగా మద్యం బెల్ట్‌షాపులు పెంచుతూ పోతున్నాడన్నారు. రాష్ట్రంలో మద్యంమాఫియా పెంచారనటానికి సాక్ష్యమే శరత్ చంద్రారెడ్డి అరెస్టు అన్నారు. విజయసాయిరెడ్డి నేతృత్వంలో తయారయ్యే కల్తీమద్యంతాగి ఎందరో ప్రాణాలు కోల్పోయారన్నారు. మద్యంకుంభకోణంతోపాటు అంబులెన్స్‌ల కుంభకోణంలోనూ విజయసాయిరెడ్డిఉన్నాడని గుడిసెకృష్ణమ్మ ఆరోపించారు.

## టమోటా పంటను ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

**పత్తికొండ, నవంబరు 10, ప్రభాతవార్త :** టమోటా పంటను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని ఏపి రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షులు పి రామచంద్రయ్య డిమాండ్ చేశారు. గురువారం రైతుసంఘం ఆద్వర్యంలో వ్యవసాయ మార్కెట్‌యార్డు ఆవరణలో రైతులు తీసుకొచ్చిన టమోటా పంటను పరిశీలించి టమోటా రైతులతో మాట్లాడారు. పత్తికొండ ప్రాంతంలో వాణిజ్య పంటగా టమోటా పంటలను రైతులు ఎక్కువగా సాగు చేస్తారన్నారు. అప్పులు తెచ్చి పంటకు పెట్టుబడులు పెడితే చేతికొచ్చిన పంటను మార్కెట్‌యార్డుకు తీసుకొస్తే కనీస మద్దతు ధర లభించడం లేదన్నారు. మార్కెట్‌లో మాత్రం రూ.20లు రూ.30లు ధర పలుకుతుందన్నారు. అధికారులు, వ్యాపారులు కమీషన్లకు కక్కుర్తిపడి నిర్లక్ష్యంగా వ్యవహరించడం వలన రైతుల రవాణా చార్జీలు కూడ రాకపోవడంతో టమోటాను పారబోస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పత్తికొండలో టమోటా జ్యూస్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి రాజాసాహెబ్, నియోజకవర్గ అధ్యక్షులు కారన్న, కౌలు రైతుసంఘం జిల్లా కార్యదర్శి తిమ్మయ్య, నాయకులు నెట్టికంటయ్య, సుంకన్న, కాశీ, మాదన్న, రాజప్ప, పులి, వెంకటరామవర్మ, నజీర్, రవి, యాటకల్లు ఆంజనేయ తదితరులున్నారు.

## సంక్షేమ పథకాల అమలులో దేశంలోనే మొదటిస్థానం : ఎంఎల్‌ఏ

- ఎంఎల్‌ఏ వై.బాలనాగిరెడ్డి



ప్రజలకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎంఎల్‌ఏ

**వగరూరు(మంత్రాలయం), నవంబర్ 10, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాల అమలులో రాష్ట్రం దేశంలోనే మొదటిస్థానంలో ఉందని వైసిపి జిల్లా అధ్యక్షులు, ఎంఎల్‌ఏ వై.బాలనాగిరెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని వగరూరు గ్రామంలో గడప-గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం వైసిపి సీనియర్ నాయకులు వై.సీతారామిరెడ్డితో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఏ మాట్లాడుతూ సంక్షేమ పథకాల అమలులో ఎవరు కూడా మధ్యవర్తులు లేకుండా డైరెక్ట్‌గా లబ్దిదారుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేస్తున్నట్లు చెప్పారు. గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ సంక్షేమ పథకాలఅమలు తీరుపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అర్హులైన ప్రతిఒక్కరూ ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలని సూచించారు. గ్రామంలోని పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. సచివాలయ ఉద్యోగులు అర్హులను గుర్తించి సంక్షేమ పథకాలు అందేలా చూడాలని తెలిపారు. ఎస్‌సి కాలనీలో ఆర్‌ఓ ప్లాంట్ ఏర్పాటు చేయాలని కాలనీ వాసులు ఎంఎల్‌ఏ దృష్టికి తీసుకువచ్చారు. తప్పకుండా ఆర్‌ఓ ప్లాంట్ ఏర్పాటు చేస్తామని ప్రజలకు ఎంఎల్‌ఏ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ భీంరెడ్డి, ఇంఛార్జ్ విశ్వనాథ్‌రెడ్డి, జడ్‌పిటిసి మజ్జిగ గోవిందమ్మ, పెట్రోల్‌బంక్ శీను, ఎస్ఐ వేణుగోపాల్‌రాజు, ఎంపిడిఓ ప్రభావతి, పిఆర్‌ఏఈ నరసింహులు, ఏపిఓ తిమ్మారెడ్డి, ఏపిఎం జయశ్రీ, ఎంఈఓ మొయినుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## పెన్షన్ అదాలత్

- ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యల పరిష్కారిస్తాం : ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ చంద్రమౌళి సింగ్



**కర్నూలు, నవంబర్, 10, ప్రభాతవార్త :** ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం కర్నూలు లో పెన్షన్/జిపిఎఫ్ అదాలత్ నిర్వహించడం జరుగుతోందని, తెలుగు రాష్ట్రాల్లో ఇది మొదటి పెన్షన్ అదాలత్ అని ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ చంద్రమౌళి సింగ్ అని పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో నిర్వహించిన పెన్షన్ /జిపిఎఫ్ అదాలత్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ మాట్లాడుతూ పదవీ విరమణ పొందుతున్న ఉద్యోగులు సంబంధించిన పెన్షన్ దరఖాస్తులను సకాలంలో తమకు పంపాలని డిడిఓలకు సూచించారు. పెన్షనర్లకు సంబంధించిన అన్ని సమస్యలను ఈ నెలాఖరు లోపు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఉద్యోగులకు సంబంధించిన జిపిఎఫ్ నామినీ, మిస్సింగ్ క్రెడిట్స్ తదితర సమస్యలను కూడా త్వరితగతిన పరిష్కరిస్తామని ఆయన తెలిపారు. జిల్లా కలెక్టర్ పి కోటేశ్వర రావు మాట్లాడుతూ వివిధ హోదాల్లో పనిచేసి పదవీ విరమణ పొందిన ఉద్యోగుల బాగోగులను అను నిత్యం పర్యవేక్షిస్తున్న కార్యాలయం ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ వారి కార్యాలయం అని తెలిపారు. ఉద్యోగులు భవిష్యత్తులో ఇబ్బందులు లేకుండా జిపిఎఫ్ ఖాతాలకు నామినీలను తప్పనిసరిగా చేయించు కోవాలని కలెక్టర్ సూచించారు. జిపిఎఫ్ ఖాతా కలిగిన ఉద్యోగులు మన జిల్లాలో దాదాపు 88 వేల మంది ఉండగా, వాటిలో కేవలం 3వేల మందికి మాత్రమే జిపిఎఫ్ ఖాతాలకు నామినీలను ప్రతిపాదించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నామినీల ప్రతిపాదనకు అవసరమైన ధరఖాస్తు ఫారాలను కూడా అందజేయడం జరుగుతుందన్నారు. విశ్రాంత ఉద్యోగులు, పని చేస్తున్న ఉద్యోగులకు ఎంతగానో ఉపయోగపడే కార్యక్రమాన్ని మొట్ట మొదటగా కర్నూలు లో ఏర్పాటు చేసినందుకు ప్రిన్సిపాల్ అకౌంటెంట్ జనరల్, ఇతర అధికారులకు కలెక్టర్ ధన్యవాదాలు తెలిపారు.. అనంతరం జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వర రావు, ప్రిన్సిపాల్ అకౌంటెంట్ జనరల్ చంద్రమౌళి సింగ్, సీనియర్ డిఎజి సాయి గాంధీ గారి చేతుల మీదుగా పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు పెన్షన్ మంజూరు పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ డిఎజి ఆర్వికె సాయి గాంధీ, డిటిఎ మోహన్ రావు, సీనియర్ ఏఓలు డి.చంద్రశేఖర్, టి.విజయ్ కుమార్, ఖజాన అధికారులు మరియు సిబ్బంది, ఉద్యోగస్తులు, విశ్రాంత ఉద్యోగస్తులు తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో పెద్దగౌరమ్మ పండుగ



పూజలందుకుంటున్న అమ్మవారు



**హొళగుంద, నవంబరు10, ప్రభాతవార్త:** హొళగుంద మండలంలో గురువారం అత్యంత భక్తిశ్రద్ధలతో పెద్దగౌరమ్మ పండుగను మహిళలు, చిన్నారులు వైభవంగా జరుపుకున్నారు. గౌరీమాతకు అభిషేకం, కుంకుమార్చన, మహామంగళా రతితో పాటు విశేష పూజలు చేశారు. ఈ పండుగ మహిళల ప్రాధాన్యత సంతరించుకోవడంతో ఆడపిల్లలను మెట్టినింటి నుండి పుట్టింటికి పిలుచుకొచ్చి పిల్లాపాపలతో పండుగను సంతోషంగా జరుపుకోవడం ఆనవాయితీ. ఉదయం నుంచే మహిళలు ఆయా ఆలయాల్లో కొలువైన గౌరీమాతకు కుంకుమార్చన, ఆకుపూజ, వివిధ రకాల పూలతో అలంకరించారు. పిల్లాపాపలతో కలిసి ఆలయానికి వెళ్లి గౌరీమాతకు నోములు, పిండి వంటలను నైవేద్యంగా సమర్పించి తమ మొక్కుబడులు చెల్లించుకున్నారు. సాయంత్రం మహిళలు, చిన్నారులు కలిసికట్టుగా కళశాలు, చక్కెర హారతులు చేతపట్టుకుని గౌరమ్మకు హారతి సమర్పించారు. దీంతో ఆలయాలు కిటకిటలాడాయి. పెద్దగౌరమ్మ పండుగ సందర్భంగా పూలు, చక్కెర హారతులు, టపాసుల కొనుగోలు దుకాణాల వద్ద ప్రజలు బారులుతీరారు. స్థానిక బస్టాండ్‌లో పండుగ సందర్భంగా రెండ్రోజుల నుండి ప్రత్యేక దుకాణాలు వెలిశాయి. యువకులు, ఉల్లాసంగా, ఉత్సాహంగా ఆలయాల వద్ద మరియు ఇంటి వద్ద టపాసులు కాల్చి సంబరాలు జరుపుకున్నారు. రాత్రికి అమ్మవారి విగ్రహమూర్తిని చిన్నారులు, పెద్దలు కలిసికట్టుగా టపాసులు కాలుస్తూ, భజన, మేళతాళాలతో వెళ్లి నిమజ్జనం చేశారు. మండలంలోని ఎల్లార్తి, సులువాయి, గజ్జహళ్లి, మార్లమడికి, చిన్నహ్యాట, పెద్దహ్యాట, కోగిలతోట తదితర గ్రామాల్లో పెద్దగౌరమ్మ పండుగను అంగరంగ వైభవంగా నిర్వహించారు.

## మైనర్ ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యం పట్ల బీజేపీ నేతల ఆందోళన



కుక్కలగంటి చెరువు కట్ట అలుగు నుంచి లీకేజీ అవుతున్న నీరు

**బనగానపల్లె, నవంబర్10, ప్రభాతవార్త:** పట్టణంలోని మైనర్ ఇరిగేషన్ కార్యాలయ అధికారులు, సిబ్బంది విధులు సరిగా నిర్వహించడంలేదని బీజేపీ నేతలు ఓబీసీ జిల్లా అధ్యక్షుల శివకృష్ణ యాదవ్, మండలశాఖ అధ్యక్షులు శరత్‌చంద్ర కుమార్‌లు ఆందోళన వ్యక్తం చేశారు. మండలంలోని జోలాపురం సమీపంలో గల కుక్కలగంటి చెరువు కట్ట అలుగు సరిగాలేక ప్రమాదకర స్థితిలో ఉందని ఇటీవల భారీ వర్షాలకు చెరువు సంపూర్తిగా నిండి అలుగు పారిందని ఈ విషయం అధికారుల దృష్టికి తీసుకువెళ్లి తగు మరమ్మతు పనులు చేయాలని తెలిపేందుకు వెళ్లగా కార్యాలయంలో సిబ్బంది ఎవరు కనిపించలేదని వారు తెలిపారు. అక్కడున్న వ్యక్తులను విచారించగా అధికారులు, సిబ్బంది వేళలు పాటించరని రోజువారి విధులకు హాజరుకావడంలేదని రెండు మూడు రోజులకు ఒకసారి అధికారులు వస్తుంటారని చెప్పినట్లు బీజేపీ నాయకులు తెలిపారు. మండలంలో దద్దణాల ప్రాజెక్టుతో సహా ఎన్నో చెరువులు ఉన్నాయని ప్రస్తుత వర్షాకాలంలో అధికారులు వాటి పరిస్థితిని సమీక్షించి అవసరమైన మరమ్మతులు చేపట్టాల్సి ఉంటుందని చెప్పారు. అయితే చెరువుల మరమ్మతుల పై అధికారులు నిర్లక్ష్య ధోరణి వహిస్తున్నారని వారు విమర్శించారు. కుక్కలగంటి చెరువుకట్ట అలుగు మరమ్మతు పనులు చేపట్టాలని వారు సూచించారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల చెరువుకు ప్రమాదం పొంచి ఉందని చెరువులో నీరు ప్రమాదకరస్థాయిలో ఉందని తెలిపారు. ఇప్పటికైనా మైనర్ ఇరిగేషన్ అధికారులు నిర్లక్ష్యం వీడి యుద్ధప్రాతిపదికన చెరువు కట్ట అలుగు మరమ్మతులు చేయాలని వారు తెలిపారు. అధికారులు ఇలాగే నిర్లక్ష్యం వహిస్తే కుక్కలగంటి చెరువు ద్వారా నీరు లీకేజి జరిగితే కట్ట అలుగు తెగిపోయే ప్రమాదం ఉందని దీని ద్వారా జోలాపురం గ్రామం మరియు చెరువు కింద ఉన్న భూములు చాలా వరకు దెబ్బతినే ప్రమాదం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లా అధికారులు తక్షణమే స్పందించి చెరువు మరమ్మతు పనులు చేపట్టాలని వారు కోరారు. అలాగే కుక్కలగంటి చెరువు నిండుకుండలా ఉన్న రైతులు ఆ నీటిని పంట పొలాలకు తరలిచేందుకు కాలువలు మట్టితో, కంపచెట్లతో పూడుకుపోయి ఉండడం వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నరన్నారు. సంబంధిత అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని కాలువలు మరమ్మతులు ఆ ప్రాంత రైతులు కోరుతున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి యాదగిరి, కిసాన్ మోర్చ జిల్లా అధ్యక్షులు శివరామిరెడ్డి, బీజేపీ మండల కార్యదర్శి సురేష్ యాదవ్, ఉపాధ్యక్షులు బాలవెంకటేశ్వర్లు, ఓబీసీ మండల ప్రధాన కార్యదర్శి గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్సార్‌సీపీ హయాంలోనే అభివృద్ధి సాధ్యం ; జయమనోజ్‌రెడ్డి



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే తనయుడు జయమనోజ్‌రెడ్డి

**ఆదోనిలీగల్, నవంబర్10, ప్రభాతవార్త ;** వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలోనే వార్డులు, గ్రామాల అభివృద్ధిని సాధ్యమని ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్‌రెడ్డి తనయుడు, వైసీపీ యువ నాయకులు జయమనోజ్‌రెడ్డి పేర్కొన్నారు. ఈమేరకు గురువారం పట్టణంలోని పలు వార్డుల్లో రోడ్లకు భూమిపూజ చేపట్టారు. అంబేడ్కర్ నగర్‌లో దాదాపు రూ.8 లక్షలతో సీసీ రడోడ్డుకు గానూ 95 మీటర్లకు, అలాగే సాయిబాబా నగర్‌లో సీసీ రోడ్డుకు భూమిపూజ చేశారు. అనంతరం జయమనోజ్‌రెడ్డి మాట్లాడుతూ అభివృద్ధి మా అజెండాగా పనిచేయడం జరుగుతుందన్నారు. పట్టణంతో పాటు గ్రామాల్లో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేస్తూ ముందుకెళ్లడం జరుగుతుందన్నారు. గ్రామ, వార్డుల అభివృద్ధికి ఎల్లప్పుడూ కృషి చేస్తామన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను పూర్తిస్థాయిలో లబ్ధిదారులకు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఆదోని పట్టణ అధ్యక్షుడు బి.దేవా, మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత, నాయకులు విష్ణురెడ్డి, శ్రీనివాసరెడ్డి, సన్నీ, వార్డు కౌన్సిలర్ తాయన్న, రామకృష్ణ, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

## గడప గడపకు మన ప్రభుత్వం

**సిబెళగల్, నవంబర్10, ప్రభాతవార్త:** సిబెళగల్ మండల పరిధిలోని క్రిష్ణదొడ్డి గ్రామంలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోడుమూరు శాసనసభ్యులు జె.సుధాకర్ ప్రతి ఇంటికి తిరిగి జగనన్న ప్రభుత్వం ఇస్తున్నటువంటి పథకాల గురించి ప్రజలకు వివరించారు. అదే విధంగా ఇతర ప్రభుత్వాల కంటే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేద ప్రజలకు ఆరోగ్యశ్రీ, జగనన్న చేదోడు, విద్యాకానుక, అమ్మఒడి, ఆసరా, జగనన్న చేయూత వంటి పథకాల గురించి ఆయన వివరించారు. ప్రజా సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించడంతోపాటు అర్హులై ఉండి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందని వారిని గుర్తించే వారికి లబ్ధిచేకూర్చేందుకే ప్రభుత్వం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలను అర్హులైన వారికి అందించేందుకు సచివాలయ వ్యవస్థ, వలంటరీ వ్యవస్థను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువచ్చారని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో అమలవుతున్న పథకాలను ఇతర రాష్ట్రాలు కూడా ఆదర్శంగా తీసుకుంటున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వానికి వస్తున్న ప్రజాదరణను ఓర్వలేక ప్రతిపక్షాలు సంక్షేమ పథకాలు వైసీపీకి వారికే అందుతున్నాయని అర్థంపర్థం లేని విమర్శలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. జగనన్న ప్రభుత్వంలో కుల, మతాలకు, పార్టీలకు అతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందిస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీనే అని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వైసీపీ నాయకులు, కార్యకర్తలు, మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి నివాసంలో అయ్యప్పస్వామి పూజలు

**బనగానపల్లె, నవంబర్10, ప్రభాతవార్త:** బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రా



మిరెడ్డి నివాసంలో గురువారం శ్రీ అయ్యప్పస్వామి పడి పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆయన సతీమణి కాటసాని జయమ్మ వారి కుమారుడు కాటసాని ఓబుళరెడ్డి దంపతులు అయ్యప్ప స్వామి పడి పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక అయ్యప్పస్వాములు అధిక సంఖ్యలో ఈ పూజల్లో పాల్గొన్నారు. శ్రీ అయ్యప్పస్వామి పడి పూజ శాస్త్రోక్తంగా అర్చకులు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి దంపతులచే నిర్వహింపజేశారు. ఈ సందర్భంగా అయ్యప్పస్వాములకు బిక్షా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే సోదరులు కాటసాని ప్రసాదరెడ్డి, కాటసాని తిరుపాల్‌రెడ్డి, అయ్యప్పస్వాములు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## గౌరీమాతకు ప్రత్యేకపూజలు

**ఆలూరు, నవంబరు 10, ప్రభాతవార్త :** మండల పరిధిలోని మొలగవల్లి, పెద్ద హోతూరు, అరికెర, హాలేబీడు, కురుకుంద, ఆలూరు తదితర గ్రామాలలో గౌరమ్మ పండుగను పురస్కరించుకొని ఆయా గ్రామాలలో నెలకొన్న గౌరీ మాత దేవాలయాలలో మహిళలు, చిన్నారులు ప్రత్యేక పూజలు జరిపి అమ్మవారికి తమ మొక్కుబడులను తీర్చుకున్నారు. ఆలూరు పట్టణంలోని కోట వీధిలో గల గౌరీ మాత ఆలయంలో ఉదయం 6గంటల నుండి గౌరీ దేవి అమ్మవారికి అభిషేకము, పుష్పార్చన, కుంకుమార్చన, బిల్వార్చన తదితర పూజలు నిర్వహించారు. మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని నోములు జరిపారు. అదేవిధంగా సాయంకాలం 6 గంటల నుండి చక్కెర హారతులు, మంగళ కళాశాలలో భక్తజనులు అమ్మవారిని పూజించారు. రాత్రి గజ గౌరీ అమ్మవారిని పట్టణ పురవీదులలో గ్రామోత్సవ కార్యక్రమంలో భాగంగా ఊరేగింపు నిర్వహించారు. అనంతరం కలిసికట్టుగా మిరుమిట్లు గొలిపే కాంతులతో బాణాసంచాలు కాల్చి ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో భీమలింగేశ్వర స్వామి, శివాలయం అర్చకులు మల్లికార్జున స్వామి, ఎర్రి స్వామి, మహిళలు, చిన్నారులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



గౌరీ మాతకు హారతి ఇస్తున్న చిన్నారులు

